రైల్వే వ్యాగన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న నాయకులు

అవినీతిపై గొంతెత్తాలి

- ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి
- సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ అధ్యక్షులు జస్టిస్ భవానీ ప్రసాద్

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

చుట్టూ జరుగుతున్న అవినీతిని గమనించి దానికి వ్యతిరేకంగా గొంతెత్తాలని, ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నించడం నేర్చుకోవాలని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ అధ్యక్షులు, ఉమ్మడి హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ జి.భవాని ప్రసాద్ పేర్కొన్నారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఓటరు అవగాహన రాష్ట్రస్థాయి కళా జాతా ముగింపు కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం కర్నూలు లలిత కళా సమితిలో గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షులు చంద్రశేఖర్ కల్కూర అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా భవాని ప్రసాద్ మాట్లాడారు. పతనం అవుతున్న నైతిక విలువలను పునరుద్ధరించుకోవాలని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఏర్పాటు చేశామన్నారు. ఓటును సక్రమంగా వినియోగించుకోకపోతే రాజ్యాంగానికి అన్యాయం చేసినట్లు అవుతుందన్నారు. ఎన్నికల్లో మంచి అభ్యర్థులను ఎన్నుకుంటే పరిపాలనలో మంచి జరుగుతుందని తెలిపారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ప్రధాన కార్యదర్శి, పూర్వ ఎన్నికల ప్రధానాధికారి నిమ్మగడ్డ రమేష్ కుమార్ మాట్లాడుతూ... ఓటును నిబద్ధతతో ఒక విలువైన సాధనంగా మలుచుకోవాలని, అప్పుడే జవాబుదారీ తనం కలిగిన నాయకులు ఎన్నికవుతారని తెలిపారు. నేడు రాష్ట్రంలో పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయన్నారు. ప్రశ్నించే తత్వాన్ని కోల్పోతే భవిష్యత్తును ఫణంగా పెట్టినట్లేనని తెలిపారు. ఓటును చోరీ కాకుండా రక్షించుకోవాలన్నారు. ఓటు వేయకపోతే ప్రభుత్వ పథకాలు రావని, ప్రభావం పెట్టడం అనైతికమని తెలిపారు. పూర్వ కలెక్టర్ రాంశంకర్ నాయక్ మాట్లాడుతూ... ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, అప్పుడే ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోగలమని తెలిపారు. ఓర్వకల్లు మహిళా సమాఖ్య గౌరవాధ్యక్షులు విజయ భారతి మాట్లాడుతూ... మనిషికున్న బంధనాల నుంచి స్వేచ్ఛ ఇచ్చేదే ఓటు హక్కు అని తెలిపారు. ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకుంటే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. 'ఓటరన్నా మేలుకో' అంటూ 'రంగం' కళాకారులు తమ ఆట, పాటలతో ఓటర్లను చైతన్య పరిచారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి, టిజివి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉమ్మడి హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ జి.భవాని ప్రసాద్

రైల్వే వ్యాగన్ వర్క్‌షాపు
నిర్మాణం పూర్తి ఎప్పుడు..?

- ఉద్యోగాలు ఇచ్చేది ఎప్పుడు : పిపిఎస్ఎస్, డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కేంద్ర ప్రభుత్వం పంచలింగాల దగ్గర 227 ఎకరాల్లో రైల్వే వ్యాగన్ నిర్మాణాన్ని చేపట్టి యువతకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. 2019 మార్చికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ 2024 వచ్చినా ఇప్పటికీ సెడ్ల నిర్మాణం తప్ప రైల్వే వ్యాగన్ నిర్మాణం పూర్తి కాలేదని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు ఇ.పుల్లారెడ్డి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ బృందం పరిశీలించి విమర్శించారు. వారు మాట్లాడుతూ రైల్వే వ్యాగన్ నిర్మాణం పూర్తి ఎప్పుడు చేస్తారని, తీవ్రమైన కరువులో ఉన్న కర్నూలు జిల్లా యువతకు ఉపాధి ఎప్పుడు కల్పిస్తారని ప్రశ్నించారు. మోడీ అధికారంలోకి వచ్చాక ఉన్నవి అమ్మడం తప్ప నిర్మించే అలవాటు లేకపోవడం వల్లే నిర్లక్ష్యంగా నత్త నడకగా ఈ ప్రాజెక్టు సాగుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించడంలో నిర్లక్ష్యం చేస్తే రాష్ట్రంలోని గతంలో అధికారంలో ఉన్న టిడిపి, ప్రస్తుత అధికారంలో ఉన్న వైసిపి కేంద్ర ప్రభుత్వాన్నే ప్రశ్నించి రైల్వే వ్యాగన్ నిర్మాణానికి కావాల్సిన అన్ని నిధులను విడుదల చేయించడంలో వైఫల్యం చెందాయని తెలిపారు. కర్నూలు జిల్లాలోని ప్రజా ప్రతినిధులు కూడా బిజెపి కేంద్ర ప్రభుత్వాన్ని కదిలించి జిల్లాలో చేపడుతున్న ఎక్కువ మందికి ఉపాధి కల్పించే ఒక పెద్ద ప్రాజెక్టును పూర్తి చేయించడంలో ఘోరంగా వైఫల్యం చెందారని అన్నారు. ఈ నిర్మాణం గనక అనుకున్నట్లే 2019 మార్చి నాటికి పూర్తి అయి ఉంటే ఈరోజు జిల్లా యువత నిరుద్యోగంతో బాధపడి ఉండే అవకాశం ఉండేది కాదని తెలిపారు. కర్నూలు జిల్లాలోని యువతి యువకులు ఉన్నత విద్యావంతులు ఆలోచించి రాబోయే ఎన్నికల్లో బిజెపి దానికి మద్దతు ఇస్తున్న తెలుగుదేశం జనసేన వైసిపి పార్టీలకు బుద్ధి చెప్పి ప్రజల కోసం పనిచేసే నాయకులను ఎన్నుకోవాలన్నారు. అప్పుడే రైల్వే వ్యాగన్ లాంటి నిర్మాణాలు పూర్తి చేసి యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. ఆ ఫ్యాక్టరీ ప్రారంభం అయితే దాని చుట్టూ అనేక పరిశ్రమలు వచ్చి ఉపాధి లభిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా నాయకులు ఎం.నాగరాజు, రమణ గౌడ్, డివైఎఫ్ఐ కర్నూలు నగర కార్యదర్శి హుస్సేన్ బాషా పాల్గొన్నారు.

వైభవంగా శ్రీశైల బ్రహ్మోత్సవాలు

- కనుల పండువగా ప్రభోత్సవం, నంది వాహన సేవ, లింగోద్భవం, పాగాలంకరణ, స్వామి అమ్మవార్లకు కల్యాణోత్సవం - భక్తజనంతో కిక్కిరిసిన క్షేత్రం

ప్రజాశక్తి- శ్రీశైలం

మహాశివరాత్రిని పురస్కరించుకొని శ్రీశైలక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, ఒరిస్సా రాష్ట్రాలనుంచి యాత్రికులు లక్షలాది మంది పాల్గొన్నారు. శ్రీశైల క్షేత్రం భక్తుజన సందోహంతో కిటకిటలాడింది. సరయిన శానిటేషన్, తాగునీరు, ఎండనుంచి తట్టుకోవడానికి చేసిన ఏర్పాట్లు సక్రమంగా లేక యాత్రికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శ్రీశైలంతోపాటు మహానంది, యాగంటి, కాలువబుగ్గ, ఓంకార క్షేత్రాలలో మహాశివరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. శైవక్షేత్రాలు యాత్రికులతో కిక్కిరిసిపోయాయి.

నవాహ్నిక దీక్షతో పదకొండు రోజుల పాటు నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాలలో భాగంగా మహాశివరాత్రి రోజు శుక్రవారం ఎనిమిదవ రోజున స్వామి అమ్మ వార్లకు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలలో భాగంగా సాయంకాలం ప్రభోత్సవం వైభావంగా నిర్వహించారు. ఇందులో గంగాధర మండపం వద్ద ప్రభకు వివిధ పూలతో అలంకరించి స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయం నుండి పల్లకిలో తీసుకువచ్చి ప్రభలో ఏర్పాటు చేసి వివిధ రకాల కోలాటం, చెక్కబజన, వంటి రకరకాల కలానృత్య ప్రదర్శనల మధ్య గంగాధర మండపం వద్ద నుండి నంది మండపం వరకు అక్కడ నుండి తిరిగి గంగాధర మండపం వద్దకు ప్రభోత్సవాన్ని వేదమంత్రాల మధ్య ఘనంగా నిర్వహించారు.

నంది వాహన సేవలో స్వామి అమ్మవార్లు: ఉత్సవాలలో భాగంగా ఆలయ ప్రాంగణంలోని అలంకారం మండపంలో స్వామి అమ్మ వాళ్ళ ఉత్సవమూర్తులను వివిధ పూలతో అలంకరించిన నంది వాహనంపై ఏర్పాటుచేసి విశేష పూజలు నిర్వహించారు.ఆ తర్వాత ఆలయ ప్రాంగణంలో నంది వాహన సేవా కార్యక్రమాన్ని మంగళ వాయిద్యాలతో వేదమంత్రాలు మధ్య నిర్వహించారు.

లింగోద్భవ కాల మహా రుద్రాభిషేకం: మల్లికార్జున స్వామికి ప్రధాన ఘట్టమైన ఈ కార్యక్రమం రాత్రి 10 గంటల నుండి 11 మంది అర్చకులు చేత నాలుగు గంటల పాటు రుద్రమంత్రాల మధ్య లింగోద్భవ కాల మహా రుద్రాభిషేకం మల్లికా గుండంలోని జలంతోను పంచామృతాలతోనూ పలు పలోదకాలతోనూ నిర్వహించారు.

పాగాలంకరణ : స్వామి వారికి లింగోద్భవ కాల మహా రుద్రాభిషేకం ప్రారంభమైన వెంటనే పాగాలంకరణ ప్రారంభమైంది. బ్రహ్మోత్సవాలలో జరిగే ఈ పాగాలంకరణకు ఓ ప్రత్యేకత ఉంది. వివాహాలలో పెళ్లి కుమారుడికి తలపాక చుట్టడం సంప్రదాయం, ఆ ఆచారం ప్రకారం శ్రీశైలం ఆలయంలో పాగాలంకరణ పేరుతో ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ పాగా స్వామివారి విమాన గోపురం నుండి ముఖ మండపంపై ఉండే నందులను అనుసంధానం చేస్తూ కడతారు. పాగాలను సమర్పించే భక్తులు నియమ, నిబంధనలతో కూడి రోజుకు ఒక మూర చొప్పున సంవత్సరం పొడవునా 365 రోజులు 365 మూరలతో ఈపాగా తయారు చేస్తారు. ఈ విధంగా నేసి తెచ్చిన పాగాను అలంకరించే వ్యక్తి దిగంబరుడై పాగాను అలంకరించాడు. అలంకరించే సమయంలో అలంకరించే వ్యక్తి దిగంబరుడై ఉన్నందున అక్కడున్నటువంటి విద్యుత్ దీపాలకు విద్యుత్ సరఫరా నిలిపేశారు. ప్రకాశం జిల్లా చీరాల హస్తినాపురం గ్రామానికి చెందిన పృథ్వి వెంకటేశ్వర్లు తనయుడు ఈ పాగాను అలంకరించారు. ప్రకాశం జిల్లా నుండి 4, బాపట్ల జిల్లా నుండి ఏడు, శ్రీకాకుళం జిల్లా నుండి ఆరు, విజయనగరం జిల్లా నుండి 3, కోనసీమ జిల్లా నుండి ఆరు, పశ్చిమగోదావరి జిల్లా నుండి రెండు, కృష్ణాజిల్లా నుండి ఒకటి, తిరుపతి జిల్లా నుండి ఒకటి, పొరుగు రాష్ట్రమైన ఒరిస్సా నుండి ఒకటి, పాగాలని సమర్పించారు.

స్వామి అమ్మవార్లకు ప్రత్యేక కళ్యాణం : మహాశివరాత్రి సందర్భంగా రాత్రి 12 గంటలకు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కళ్యాణోత్సవంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. వేదమంత్రాలు మధ్య లోక కళ్యాణాన్ని కాంక్షిస్తూ కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు.

శ్రీశైల మల్లన్న ఆలయ గోపురానికి పాగాలంకరణ

శ్రీశైల ప్రభోత్సవానికి భారీగా తరలి వచ్చిన భక్తజనం

కర్నూలు వైసిపి ఎంపి అభ్యర్థిగా బివై.రామయ్య

ప్రజాశక్తి-కర్నూలు క్రైం

కర్నూలు పార్లమెంట్ వైసిపి ఇంచార్జిగా బివై.రామయ్యను ఆ పార్టీ అధిష్టానం ఖరారు చేసింది. ఈ మేరకు శుక్రవారం వైసిపి సమన్వయకర్తల 11వ జాబితా విడుదల చేశారు. అందులో కర్నూలు పార్లమెంట్ వైసిపి సమన్వయకర్తగా బివై.రామయ్యను నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో వైసిపి తరపున కర్నూలు పార్లమెంట్ ఎంపిఅభ్యర్థిగా రామయ్య పేరు ఖరారైంది. రామయ్య ప్రస్తుతం కర్నూలు నగర పాలక సంస్థ మేయర్‌గా ఉన్నారు.

టిడిపి నుంచి వైసిపిలోకి 50 కుటుంబాలు

ప్రజాశక్తి- క్రిష్ణగిరి

క్రిష్ణగిరి మండలం ఆలంకొండ, పెద్దొడ్డి గ్రామంలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి,ఎంపిపి డాక్టర్ వెంకట రామిరెడ్డి, జెడ్‌పిటిసి కెఇ.సుభాషిణి, క్రిష్ణగిరి మండలం కన్వీనర్ ఆర్బి వెంకట్రాముడు ఆధ్వర్యంలో 50 కుటుంబాలు టిడిపి నుంచి వైసిపిలోకి చేరాయి. ఎమ్మెల్యే చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై ఆలంకొండ,పెద్దొడ్డి గ్రామాలకు చెందిన నక్కొల్లు, తలారోల్లు, కోయిలకొండ, బోయిని, ఊడలోల్లు ఈ వర్గానికి చెందిన పెద్దకౌలుట్ల, చిన్నకౌలుట్ల, సోమన్న, వీరాంజనేయులు తదితరులకు శుక్రవారం ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి పార్టీ లోకి అహ్వానించారు. ఎమ్మెల్యే గెలుపునకు కృషి చేస్తామని చెప్పారు.

శ్రీనివాసులుకు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లా గూడూరు మండల కేంద్రానికి చెందిన మునుగాల శ్రీనివాసులుకు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆ విభాగం ప్రొఫెసర్ దాశరథి రవీందర్ పర్యవేక్షణలో పిహెచ్‌డి డిగ్రీ కోసం " యూజ్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అమాంగ్ ఎంటెక్ స్టూడెంట్స్ ఆఫ్ యూనివర్సిటీ కాలేజెస్ ఇన్ ద రాయలసీమ ఏరియా ఆంధ్ర ప్రదేశ్ ఏ స్టడీ" అనే అంశంపై పరిశోధన గ్రంధాన్ని యూనివర్సిటీకి శ్రీనివాసులు సమర్పించారు. రాయలసీమ ప్రాంతంలో వివిధ విశ్వవిద్యాలయాల పరిధిలోని ఎంటెక్ విద్యార్థులు ఉన్నత విద్యలో సమాచారాన్ని స్వీకరించే నిమిత్తం వారు ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించి పోటీ ప్రపంచంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని ఆకలింపు చేసుకోవడం, సాంకేతిక విద్యలో గ్రంథాలయాలు, ఎలక్ట్రానిక్ వనరుల ప్రముఖ్యతపై ఈ పరిశోధన సాగింది. ఓపెన్ వైవా వాయిస్‌లో తన పరిశోధనని సైంటిఫిక్ మెథడ్‌లో నివేదికను విజయవంతంగా అందజేశారు. ఈనేపథ్యంలో శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీ మునుగాల శ్రీనివాసులుకు డాక్టరేట్ ప్రదానం చేసింది. ఓపెన్ వైవా వాయిస్ ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ లైబ్రరీ సైన్స్ విభాగం ప్రొఫెసర్ ఆర్. సెవుకన్ హాజరయ్యారు. ఎస్‌కె యూనివర్సిటీ ఆర్ట్స్ విభాగం డీన్ ప్రొఫెసర్ బివి రామన్, ప్రొఫెసర్ వెంకట్ నాయుడు తన అధ్యయనానికి సహకరించారన్నారు. తన డాక్టరేట్ ఫలప్రదం అయ్యేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

దళిత క్రైస్తవులను ఎస్‌సిలుగానే కొనసాగించాలి

'మత స్వేచ్ఛను సామరస్యాన్ని కాపాడాలి' నేడు సదస్సు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

దళిత క్రైస్తవులను ఎస్సీలుగానే గుర్తించాలని, మత స్వేచ్ఛను మత సామరస్యాన్ని కాపాడాలని కోరుతూ మార్చి 9న జిల్లా పరిషత్‌లోని ఎంపిపి హాల్లో జరిగే సదస్సును జయప్రదం చేయాలని భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా నాయకులు ఎండి.ఆనంద్ బాబు, పిఎస్ రాధాకృష్ణ పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సదస్సుకు సంబంధించిన కరపత్రాలను వారు విడుదల చేసి మాట్లాడారు. కులం కారణంగా ఆర్థికంగా సామాజికంగా అణిచివేయబడ్డ దళితులు తమ సమస్యలను దేవునికి చెప్పుకునే అవకాశం కూడ లేక ఈ దేశంలో దళితులు క్రైస్తవులుగా మారారన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 నుండి 28 వరకు ఎవరు ఏ మతాన్ని అయినా స్వీకరించి ఆచరించి ప్రచారం చేసుకోవచ్చని ఉందని, రాజ్యాంగానికి భిన్నంగా మత ఉన్మాదుల ప్రవర్తన కొనసాగుతోందన్నారు. క్రైస్తవం స్వీకరించిన దళితులకు రిజర్వేషన్ ఇవ్వరాదంటూ ఈ మధ్యకాలంలో పెద్ద ఎత్తున వివాదాలు సృష్టిస్తూ గగ్గోలు పెడుతున్న వారి సంఖ్య పెరుగుతోందని విమర్శించారు. రిజర్వేషన్ల కల్పనకు రూపం ఏమిటి? దాని సారం ఎటు పోతోంది? దళిత క్రైస్తవుల యొక్క సామాజిక స్థితి ఏమిటి అనే అన్ని రకాల అంశాలపై క్షుణ్ణంగా విశ్లేషించి తెలియజేసే విధంగా మార్చి 9న ఉదయం 10 గంటలకు సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సుకు ప్రముఖ సామాజిక విశ్లేషకులు దళిత్ సోషన్ ముక్తి మంచ్ జాతీయ నాయకులు జగ్గుల జాన్ వెస్లీ హాజరవుతున్నారన్నారు. సదస్సుకు దళిత క్రైస్తవ సమూహాలతో పాటు క్రైస్తవులుగా మారిన దళితులను ఎస్సీలుగానే కొనసాగించాలి మత స్వేచ్ఛను సామరస్యాన్ని కాపాడాలనే భావించే ప్రతి ఒక్కరు హాజరుకావాలని కోరారు. భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక నాయకులు ఎం రాజశేఖర్, ఎం.భాస్కర్, ఆంద్రా గురుస్వామి, ఎస్ అబ్దుల్లా, ఎం రంగప్ప పాల్గొన్నారు.

'మత స్వేచ్ఛ, సామరస్యం సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కుల,మతాలకు అతీతంగా సేవచేస్తాం : టిజి.భరత్

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

కర్నూలులో కులం, మతం చూడకుండా ప్రతి ఒక్కరికీ తమ టిజివి గ్రూప్స్ తరుపున సహాయం చేస్తామని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి టిజి.భరత్ అన్నారు. 52వ వార్డు పరిధి సాయిబాబా నగర్లో నూతనంగా నిర్మించిన క్రీస్తు సంఘం మందిరాన్ని పెద్దలతో కలసి టిజి.భరత్ ప్రారంభించారు. టిజి.భరత్ మాట్లాడుతూ చర్చి నిర్మాణంలో రూ.7లక్షలు వెచ్చించి తమ టిజివి సంస్థల తరుపున భాగస్వామ్యం అవ్వడం తన అదృష్టంగా భావిస్తానని పేర్కొన్నారు. దేవుని ఆశీస్సులు ఉంటేనే ఇలాంటి సహాయ సహకారాలు అందిచస్తామన్నారు. ప్రజలు కూడా నిస్వార్థంగా సేవ చేసే తమను ఆశీర్వదించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో మంచి ప్రభుత్వాన్ని, మంచి నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. ఓటు వారికే వేయాలని బైబిల్ పట్టుకొని వచ్చినా, పాస్టర్లు, ఫాదర్లు చెప్పినా ప్రజలు ఒక్క నిమిషం ఆలోచించి మంచి వ్యక్తికి ఓటు వేయాలన్నారు. ఎలాంటి అధికారం లేకుండా ప్రజలకు సేవ చేస్తున్న తమకు అధికారం ఇస్తే పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేసే వీలుంటుందన్నారు. ప్రజలంతా వచ్చే ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించాలన్నారు. సంఘ సేవకులు ఆనందరావు, క్రీస్తు సంఘ సేవకులు ప్రసాదరావు, ఇబ్రహీంపట్నం క్రీస్తు సంఘ సేవకులు విజయరావు, రాజ్ కుమార్, సురేంద్ర, కె.రాజ్ కుమార్, నాగరాజు, సుదర్శనం, పాస్టర్ రాజు, వీరశైవ సాధికార కమిటీ నాయకులు శివరాజ్ పాల్గొన్నారు.

క్రీస్తు సంఘం సమావేశంలో పాల్గొన్న టిజి.భరత్

లంచం ఇవ్వలేదని ఇంటి పట్టా ఇవ్వలేదు

తహశీల్దార్‌కు వినతి

ప్రజాశక్తి-మద్దికేర

తహశీల్దార్‌కు విన్నవిస్తున్న రవికుమార్

రెవెన్యూ అధికారులు లంచం ఇవ్వలేదని జగనన్న కాలనీలో తమకు ఇంటిపట్టా ఇవ్వలేదని అగ్రహారంకు చెందిన హిజ్రా సిలోని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం మండల కార్యదర్శి రవికుమార్ సహకారంతో అర్హురాలైన హిజ్రా సిలోనికి ఇంటిపట్టా ఇవ్వాలని తహశీల్దార్ రాజాక్ వలిని కోరారు. జగనన్న కాలనీలో తమతో పాటు మరో ఇద్దరు హిజ్రాలకు డబ్బులు తీసుకుని పట్టాలిచ్చారని, తాను డబ్బులు ఇవ్వలేదన్న కారణంతో తనకు ఇంటి పట్టా రెవెన్యూ అధికారులు ఇవ్వడం లేదని హిజ్రా ఆగ్రహం వ్యక్తం చేశారు. రవికుమార్ మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు లంచం ఇచ్చిన వారికే ఇంటి పట్టాలివ్వడం మంచి పద్ధతి కాదన్నారు. ఈ విధంగా వ్యవహరిస్తే భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాలు చేస్తామన్నారు. అర్హులైన హిజ్రాకు వెంటనే ఇంటి పట్టా ఇవ్వాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఇంటి స్థలాలను దళితులకే ఇవ్వాలి

ప్రజాసంఘాల డిమాండ్

ప్రజాశక్తి-మద్దికేర : మద్దికెర సర్వే నెంబర్ 444/2బిలో ఇంటి పట్టాలను దళితులకే ఇవ్వాలని ఎపి ఎంఆర్‌పిఎస్,సిఐటియు నాయకులు నాయకులు ఆనందు, రాము, కడవల రవికుమార్,బురుజుల రాముడు అన్నారు. ఆర్‌డిఒతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎస్‌సి కార్పొరేషన్ నిధులతో కొనుగోలు చేసిన భూమిని ఇతరులకు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఇంటి స్థలాలను దళితులకే పంచాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజా సంఘాలు ఏకమై పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

హ్యాండ్‌బాల్ పోటీల లోగోను ఆవిష్కరిస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

హ్యాండ్ బాల్ పోటీల లోగోను ఆవిష్కరించిన డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఈనెల 9,10వ తేదీల్లో స్థానిక ఆదర్శ విద్యా మందిరంలో జరగనున్న 52వ రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పురుషుల ఛాంపియన్‌షిప్ లోగోను ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య నిపుణులు డాక్టర్ బి. శంకర్ శర్మ ఆవిష్కరించారు. శుక్రవారం స్థానిక గాయత్రి ఎస్టేట్‌లోని గురుదత్త క్లినిక్‌లో ఏర్పాటుచేసిన ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సి.శ్రీనివాసులు, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు రామాంజనేయులు, క్రీడా సంఘ ప్రతినిధులు టి గంగాధర్, కొండపోగు చిన్న సుంకన్న, నాగ శ్రీనివాసులు పాల్గొన్నారు. డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ పోటీలో నిర్వహణ కష్టతరమని అటువంటి కష్టతరమైన పనిని ఇష్టంతో విజయవంతం చేయడం హర్షనీయమన్నారు. ఇటువంటి పోటీలో పాల్గొని క్రీడాకారుల విద్యా ఉద్యోగాల్లో లభించే అవకాశాలను వినియోగించుకోవాలని ఆయన కోరారు. వేగవంతమైన క్రీడల్లో హ్యాండ్ బాల్‌ను క్రీడాకారులు ఎంచుకోవడం చాలా సంతోషమన్నారు. ఇందులో సంపూర్ణ ఆరోగ్య వికాసానికి అవకాశాలు ఉన్నాయన్నారు.

వైసిపి నుంచి టిడిపిలోకి 100 కుటుంబాలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఓర్వకల్లు మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన నవ్యాంధ్రప్రదేశ్ జెఎసి అధ్యక్షుడు అయ్యస్వామి, వైసిపి నాయకుడు రాజు తో పాటు వారి ఆధ్వర్యంలో 100 వైసిపి కుటుంబాలు గౌరుచరిత, వెంకట రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరారు. వారికి గౌరు దంపతులు టిడిపి కండువాలు కప్పి స్వాగతం పలికారు. సెంట్రింగ్ రాజు, కిషోర్, అనిల్, అరుణ్, సురేష్ పవన్ నాగరాజు, బి.మారన్న, లక్ష్మన్న వెంకటేశ్వర్లు, మాల ఆయ్యస్వామి టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో ఓర్వకల్లు మండల నాయకులు పాలకొలను సుధాకర్ రెడ్డి, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు బ్రహ్మణ పల్లె నాగిరెడ్డి, ఉప్పలపాడు గ్రామ నాయకులు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రైతు సంరక్షణ కేంద్రాలుగా ఆర్‌బికెలు

- ఎమ్మెల్యే ఎర్రకోట, వైసిపి ఇన్‌ఛార్జ్ బుట్టా రేణుక

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రైతు సంరక్షణ కేంద్రాలుగా రైతు భరోసా కేంద్రాలు వెలుస్తున్నాయని ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, వైసిపి ఇన్‌ఛార్జ్ బుట్టా రేణుక తెలిపారు. శుక్రవారం మండలంలోని దేవబెట్టు గ్రామంలో నూతన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్ఆర్ హెల్త్ సెంటర్ భవనం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేశంలో ఇప్పటి వరకు ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను తెచ్చిందని తెలిపారు. అవినీతికి, వివక్షతకు తావు ఇవ్వకూడదని, పరిపాలన ప్రజలకు చేరువ కావాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారని చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో దాదాపు 35 ప్రభుత్వ శాఖలకు సంబంధించి 500 సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. మండల కన్వీనర్ బిఆర్.బసిరెడ్డి పాల్గొన్నారు.

ఆర్‌బికెను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, ఇన్‌ఛార్జ్ బుట్టా రేణుక

ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకూడదు

- వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జ్ విరుపాక్షి

నీటిని మళ్లిస్తున్న విరుపాక్షి

ప్రజాశక్తి - చిప్పగిరి

వేసవిలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకూడదని వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జ్ బి.విరుపాక్షి తెలిపారు. అందుకోసమే హంద్రీనీవా కాలువ నీటిని ట్రాక్టర్లు ఇంజిన్ల ద్వారా పైపులు వేయించి ఖాజీపురం రిజర్వాయర్‌కు నీటిని తరలిస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం 8 ట్రాక్టర్లు ఇంజిన్ల ద్వారా హంద్రీనీవా నీటిని తరలించేందుకు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిప్పగిరి మండలం ఖాజీపురం రిజర్వాయర్ నుంచి గుమ్మనూరు, ఖాజీపురం, దేగులపాడు, బంటనహాల్, చిప్పగిరి, కుందనగుర్తి తదితర గ్రామాలతో పాటు మద్దికెర మండలానికి తాగునీటి సరఫరా ఖాజీపురం రిజర్వాయర్ ద్వారా జరుగుతుందని తెలిపారు. అలాంటి రిజర్వాయర్‌లో ఉన్న నీరు చివరి దశకు చేరుకుందని చెప్పారు. నీటి సరఫరా జరిగే ఆయా గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తిందని తెలిపారు. గత నెల క్రితం రిజర్వాయర్‌ను నీటితో నింపాలని ప్రజలు విరుపాక్షిని కోరారు. శుక్రవారం సందర్శించిన ఆయన అక్కడి పరిస్థితిని చూసి వెంటనే స్పందించి సుమారు రూ.10 నుంచి రూ.15 లక్షల సొంత నిధులతో అప్పటికప్పుడు 8 ట్రాక్టర్ల ద్వారా హంద్రీనీవా నుంచి రిజర్వాయర్‌లోకి నీటిని మళ్లింపు చేయించారు. విషయం తెలుసుకున్న ఖాజీపురం రిజర్వాయర్ నుంచి తాగునీటి సరఫరా జరిగే గ్రామాల ప్రజలు హుటాహుటిన అక్కడికి చేరి విరుపాక్షికి కృతజ్ఞతలు తెలిపారు. విరుపాక్షి చేసిన మేలును తాము ఎప్పటికీ మర్చిపోమని, కేవలం నెలలోనే తమ సమస్యను తెలుసుకున్న ఆయన పరిష్కరించారని చెప్పారు. చిప్పగిరి మండల కన్వీనర్ జూటూరు మారయ్య, వైసిపి నాయకులు ఏరూరు సేనాపతి, నాగప్ప, కేసరి గంగాధర్, పెద్దయ్య, రిజర్వాయర్ కాంట్రాక్టర్ గోవిందు, హనుమంతు పాల్గొన్నారు.

ప్రభుత్వ మొండి వైఖరి నశించాలి

- అమ్మ వికలాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఈరన్న

ప్రజాశక్తి - ఆదోని

వికలాంగుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం మొండి వైఖరి నశించాలని అమ్మ వికలాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు, వికలాంగుల సంక్షేమ జిల్లా జెఎసి జిల్లా కోశాధికారి ఈరన్న విమర్శించారు. శుక్రవారం చలో విజయవాడ వికలాంగుల మహాగర్జన కార్యక్రమంలో భాగంగా ఆదోనిలో ముందస్తు అరెస్టు చేశారు. ప్రజాస్వామ్య బద్ధంగా చేస్తున్న ఆందోళనలను అణచివేత ధోరణి ప్రజాస్వామ్య మనుగడకే ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఈరన్నను అరెస్టు చేస్తున్న పోలీసులు

కుక్కలు బాబోయ్.. కుక్కలు

- కుక్కల దాడులకు గురవుతున్న చిన్నారులు, మహిళలు
- కుక్కకాటుపై ప్రతి కౌన్సిల్ సమావేశంలోనూ సభ్యుల ఆందోళన

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణంలో రోజురోజుకు కుక్కల బెడద ఎక్కువవుతోంది. పట్టణంలో ఎక్కడ చూసినా గుంపులు గుంపులుగా కుక్కలు ఉండడంతో అవి మనుషులపై దాడులకు ఎగబడుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల పాఠశాల వద్ద ఉన్న ఒక చిన్నారిపై కుక్కలు దాడి చేయడంతో ఆ చిన్నారి తీవ్ర గాయాలకు గురైంది. పట్టణంలోని అనేక వార్డుల్లో కుక్కలు సైర్య విహారం చేయడంతో కుక్కల కాటుకు గురవుతున్న ప్రజలు ఆయా వార్డు కౌన్సిలర్లతో వాగ్వాదానికి దిగుతున్నారు. ఏ వీధికి వెళ్లి విచారించినా కుక్క కాటుకు గురైన వారు కనబడుతున్నారు. చివరకు కౌన్సిలర్ కుటుంబ సభ్యులు సైతం ఒకరు గురి కావడంతో ఆ కౌన్సిలర్ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలోనూ కుక్క కాటుపై కౌన్సిలర్లు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో కుక్కకాటు బాధితులు రోజురోజుకు పెరుగుతున్నారని, కనీసం వాటి బారి నుంచి కాపాడలేని పరిస్థితుల్లో ఉన్నామా అంటూ కౌన్సిలర్ రఘునాథరెడ్డి, సైరానా భాను అధికారులను నిలదీశారు. ఎంఐజి కాలనీ, వెంకన్నపేట, ఫరిసా మొహాల్లా, బుడేకల్, క్రాంతి నగర్, అరుణ్ జ్యోతి నగర్ ప్రాంతాల్లో కుక్కల సంతతి రోజురోజుకు పెరుగుతోందన్నారు. వెంకన్నపేటలో ఇటీవల ఓ చిన్నారిపై వీధి కుక్క దాడి చేసిన విషయం తెలిసిందేనని వివరించారు. పట్టణంలోని కాజీపురకు చెందిన సచివాలయంపై కుక్క దాడి చేసే ప్రయత్నం చేసింది. ఆ వాలంటీరు వికలాంగుడు కావడం, ప్లాస్టిక్ కాలు ఉండడంతో కుక్క కరిచినా ఎలాంటి గాయమూ కాలేదని అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పట్టణంలోని చిన్న కమేళా, పెద్ద కమేళా, చిన్న మార్కెట్, మాంసం దుకాణాల వద్ద వందల సంఖ్యలో కుక్కలు దర్శనమిస్తున్నాయి. ఆదోని అటవీ శాఖ అధికారులను సంప్రదించి కుక్కలను పట్టే విధంగా చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ కమిషనర్ అనుపమ పేర్కొన్నారు. ఎవరైనా ఆ ప్రాంతాల్లో ఎవరైనా వెళ్లాలంటేనే భయాందోళనకు గురవుతున్నారు. ఆదోని మున్సిపాలిటీ లెక్కల ప్రకారం ఆదోనిలో సుమారు 4 వేల కుక్కలు ఉన్నట్లు తెలిసింది. పట్టణంలోని 7, 9, 13వ వార్డుల్లోనూ కుక్కలు ఎక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కుక్క కాటుకు గురై అనేకమంది చికిత్స కోసం ప్రభుత్వాస్పత్రికి క్యూ కడుతున్నారు. ఇటీవల పట్టణంలో కుక్కల దాడికి గురైన సంఘటనలు అనేకం వెలుగు చూశాయి. చిన్నపిల్లలు సైతం కుక్కల దాడలకు గురై తీవ్ర గాయాలకు గురవుతున్నట్లు తల్లిదండ్రులు వాపోతున్నారు. మున్సి పల్ అధికారులు కుక్కల బెడద నుంచి కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

రిలయన్స్ ట్రెండ్ వద్ద గుంపుగా ఉన్న వీధి కుక్కలు

కప్పట్రాళ్ల బొజ్జమ్మకు

సముచిత స్థానం దక్కేనా..?

- వాల్మీకి సామాజిక తరగతి కింద ఎంపీ సీటు కోసం యత్నం

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండ మండలంలో కప్పట్రాళ్ల గ్రామానికి ఓ ప్రత్యేకత ఉంది. చాలా ఏళ్లుగా కప్పట్రాళ్ల వెంకటప్ప నాయుడు టిడిపిలో ఉండి డోన్, కోడుమూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు వంటి నియోజకవర్గాల్లో తన ప్రాబల్యాన్ని పెంచుకోవడంతో ఓటు బ్యాంకు ఉండేది. ముఠా కక్షలతో ప్రత్యర్థులు వెంకటప్ప నాయుడును హత్య చేశారు. ఆయన కుమార్తె కప్పట్రాళ్ల బొజ్జమ్మ రాజకీయ వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు. ఆమె టిడిపి ప్రభుత్వంలో ఆస్పరి జడ్‌పిటిసిగా, ఆమె భర్త రామచంద్ర నాయుడు దేవనకొండ ఎంపిపిగా పని చేశారు. 2019 ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ టిడిపిలోనే కొనసాగుతూ వచ్చారు. టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు కప్పట్రాళ్ల కుటుంబానికి న్యాయం చేస్తామని హామీఇచ్చినప్పటికీ సముచిత స్థానం లభించలేదని గత కొన్ని నెలల క్రితం ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి సమక్షంలో వైసిపిలో చేరారు. జగన్మోహన్ రెడ్డి సముచిత స్థానం కల్పిస్తామని భరోసా ఇచ్చారని అప్పట్లో బాహాటంగానే చెప్పుకున్నారు. ఇటీవల ఆలూరు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆశించినప్పటికీ చిప్పగిరి జడ్‌పిటిసి విరుపాక్షిని సమన్వయకర్తగా, ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడంతో నిరుత్సాహానికి గురయ్యారు. కర్నూలు పార్లమెంటు స్థానానికి ఎంపీ అభ్యర్థిగా గుమ్మనూరు జయరామ్‌కు కేటాయించినప్పటికీ ఆయన ఆలూరు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని వైసిపి అధిష్టానాన్ని కోరారు. 'ఎమ్మెల్యే టికెట్ ఇవ్వం. కర్నూలు పార్లమెంట్ స్థానానికి ఎంపీగా పోటీ చేయాల'ని ఆదేశించింది. ఎంపీ స్థానానికి పోటీకి ఇష్టం లేక ఆయన వైసిపికి గత కొంతకాలంగా దూరమయ్యారు. చివరికి టిడిపిలో చేశారు. వైసిపి ఎంపీ అభ్యర్థిగా కర్నూలు నగర మేయర్ బివై.రామయ్య పేరును వైసిపి అధిష్టానం ప్రకటించింది. బివై.రామయ్య మేయర్ పదవిని విడిచి ఎంపీగా పోటీ చేసేందుకు సుముఖంగా లేరని అంటున్నారు. ఈ మేరకు వైసిపి అధిష్టానం ఆదేశిస్తే ఎంపీ స్థానానికి పోటీ చేయడానికి కప్పట్రాళ్ల బొజ్జమ్మ సర్వం సిద్ధంగా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. వాల్మీకి సామానికి తరగతికి చెందిన కప్పట్రాళ్ల బొజ్జమ్మకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఎంపీ టికెట్ కేటాయించి సముచిత స్థానం కల్పించవచ్చని అనుకుంటున్నారు.

జగన్మోహన్ రెడ్డితో ఉన్న బొజ్జమ్మ (ఫైల్)

భువనేశ్వరిని కలిసిన మాచాని సోమనాథ్

భువనేశ్వరితో మాట్లాడుతున్న సోమనాథ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

'నిజం గెలవాలి' యాత్రలో భాగంగా పత్తికొండ నియోజకవర్గం విచ్చేసిన టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరిని శుక్రవారం టిడిపి నాయకులు డాక్టర్ మాచాని సోమనాథ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాచాని సోమనాథ్ భువనేశ్వరితో కాసేపు మాట్లాడారు. చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేయాలనే సంకల్పంతో 'బాబు ష్యూరిటీ – భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నియోజకవర్గమంతా ప్రజల్లోకి తీసుకెళ్తున్న విషయాన్ని వారికి వివరించారు. తన ముత్తాత కీర్తిశేషులు పద్మశ్రీ మాచాని సోమప్ప ఎమ్మిగనూరుకు అందించిన సేవలను స్ఫూర్తిగా తీసుకొని రాజకీయాల్లో కొనసాగుతున్నానని తెలిపారు. ఎమ్మిగనూరులో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై భువనేశ్వరితో చర్చించారు. వారితో పాటు ఉన్న ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, మాజీ మంత్రి గుమ్మనూరు జయరామ్‌ను కలిసి పరిచయం చేసుకున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. భువనేశ్వరి డాక్టర్ మాచాని సోమనాథ్‌ను అభినందించి ముందుకెళ్లాలని సూచించారు.

భువనేశ్వరిని కలిసిన కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరిని కలిసినట్లు టిడిపి ఆదోని మాజీ ఇన్‌ఛార్జ్ గుడిసె కృష్ణమ్మ తెలిపారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ పుష్పగుచ్ఛం అందజేశామని వివరించారు.

భువనేశ్వరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గుడిసె కృష్ణమ్మ

శివరాత్రి ఉత్సవాలకు ఎరిగేరి ముస్తాబు

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని ఎరిగేరి గ్రామం శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబయింది. ఈ ఉత్సవాలు గ్రామస్తుల ఆధ్వర్యంలో మూడు రోజులపాటు వైభవంగా నిర్వహిస్తారు. శివరాత్రి పండగ సందర్భంగా గ్రామ సమీపంలో వెలసిన శ్రీపులి గొట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. కొండపైనే స్వామివారికి ఇష్టమైన నైవేద్యాల వండి పూజలు నిర్వహిస్తారు. చివరి రోజు శ్రీఆంజనేయ స్వామి పల్లకిని గ్రామంలో ఊరేగిస్తారు. ఈ ఉత్సవాల సందర్భంగా గ్రామమంతా విద్యుద్దీపాలతో అలంకరించి, బంధువులతో భక్తిశ్రద్ధలతో పండగను జరుపుకుంటారు.

ముస్తాబైన ఆలయం

టిడిపితోనే ప్రజాసంక్షేమం, అభివృద్ధి

- మాజీ ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రజా సంక్షేమం, అభివృద్ధి టిడిపితోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని 14వ వార్డులో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 6వ రోజు బీవీ.జయనాగేశ్వర రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ప్రతి గడపకూ తిరుగుతూ టిడిపి ప్రభుత్వం ఏర్పడ్డాక అందించే సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎమ్మిగనూరు పట్టణం తమ తండ్రి కీర్తిశేషులు బీవీ.మోహన్ రెడ్డి హయాంలో, తన హయాంలో అభివృద్ధి చెందిందని తెలిపారు. ఐదేళ్ల వైసిపి పాలనలో ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదని విమర్శించారు. అభివృద్ధి కావాలంటే టిడిపి ప్రభుత్వం రావాలన్నారు. 'బటన్ నొక్కుతున్న, బటన్ నొక్కుతున్న' పేరుతో జగన్‌రెడ్డి ప్రజల పీకలు నొక్కారని ఎద్దేవా చేశారు. ఐదేళ్లలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. టిడిపి ప్రభుత్వం ఏర్పడ్డాక పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికీ సూపర్ సిక్స్ పథకాలను అందిస్తామన్నారు. వార్డు ఇన్‌ఛార్జ్ బందే నవాజ్ పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

ధ్వజస్తంభం ప్రతిష్టాపనలో బీవీ

ఎమ్మిగనూరు రూరల్ : మండలంలోని చెన్నాపురం గ్రామంలో ధ్వజస్తంభ ప్రతిష్టాపనకు మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బీవీ.జయనాగేశ్వర రెడ్డి హాజరయ్యారు. శుక్రవారం ఆయన గ్రాయంలో పర్యటించి, నూతనంగా నిర్మించిన శ్రీఆశీర్వాద ఆంజనేయ ఈశ్వర స్వామి దేవాలయం ప్రారంభోత్సవం సందర్భంగా దేవాలయంలో ధ్వజస్తంభం ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీఆశీర్వాద ఆంజనేయ స్వామి వారిని, ఈశ్వరున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. టిడిపి గ్రామ నాయకులు కురువ నాగరాజు, కురువ తిమ్మప్ప, కురువ సర్వయ్య, వీరేష్, ఉప్పర బాలరాజు పాల్గొన్నారు.

మహారాజశ్రీ కర్నూలు 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో :

ఓ.ఎస్.నెంబర్ 833/22

దేశెట్టి శ్రీనివాసులు. ...వాది

వర్సెస్

వై.జానకి రాం తండ్రి వై.నారాయణ,
వ్యాపారం, ఇంటి నెంబర్ 51/28,
వెంకటరమణ కాలనీ, కర్నూలు. ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్లు

పై నెంబర్ దావాలో వాది ప్రతివాది నుండి దావా మొత్తము 3,94,866/-లు ముందు వడ్డీ, కోర్టు ఖర్చులు రాగోరి దావా దాఖలు చేసినాడు. ఇందుపైన ప్రతివాది అయిన నీకు ఆక్షేపణలు ఉన్న 19-04-2024వ తేదీ పగలు 10:30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుపుకొన వలెను. లేనంతట నీ పరోక్షమున విచారించి తీర్మానించ బడును

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా తేది : 19-04-2024

డి.మహమ్మద్ రఫీ,
అర్జీదారుపురం అడ్వకేట్,
కర్నూలు.

ఘనంగా మహా శివరాత్రి వేడుకలు

ప్రజాశక్తి - హోళగుంద

మండలంలోని దేవరగట్టు గుహల్లో వెలసిన శ్రీమాల మల్లేశ్వర ఆలయం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివనామ స్మరణతో మార్మోగింది. శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి భక్తులు పూజలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు బండారు అర్చన, కుంకుమార్చన వంటి పూజలు నిర్వహించారు. మండలంలోని ప్రతి శివాలయంలోనూ ప్రత్యేక పూజలు, అన్నదానాలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. **నందవరం** మండలంలని గురజాల గ్రామంలో శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయం శివనామస్మరణతో మార్మోగింది. మహాశివరాత్రి సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి క్యూలైన్లలో బారులు తీరారు. దేవాలయంలో స్వామి వారికి యాగమండప ప్రవేశం, గణపతి పూజ, కలశ స్థాపనం, అంకురార్పణ, శత రుద్రాభిషేకం, కుంకుమార్చన, రాత్రి లింగోద్భవన సమయంలో క్షీరాభిషేకం, రుద్రాభిషేకం రాత్రి 2 గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం కనుల పండువగా ఆలయ ఇఒ దినేష్ తన సిబ్బందితో నిర్వహించారు. స్వామివారిని మాజీ ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వర రెడ్డి దర్శించుకున్నారు. అలాగే ఎస్ఐ పి.తిమ్మయ్య క్యూలైన్లు, జాతరకు వచ్చే భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. **ఆదోని**లోని మండగిరిలో వెలసిన శ్రీఈశ్వరస్వామి దేవాలయంలో మహాశివ రాత్రి సందర్భంగా ఆదోని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజవకర్గ ఇన్‌ఛార్జ్ కొంకా మీనాక్షి నాయుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వార్డు పెద్దలు నాగభూషణం, శ్రీనివాస్ ఆచారి, బసవ రాజప్ప, నరేంద్ర, వీరేష్ పాల్గొన్నారు. **ఆలూరు** మండలంలోని అన్ని శివాలయాల్లోనూ తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని భీమా లింగేశ్వర స్వామి ఆలయం, జలకంతేశ్వర స్వామి ఆలయంలో ఆలూరు సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ ఓబులేసు ప్రత్యేక పూజలు నిర్వహించారు. **ఎమ్మిగనూరు** పట్టణంలోని శ్రీనీలకంఠేశ్వర స్వామి దేవాలయంలో, వీవర్స్ కాలనీలోని శ్రీఆంజనేయ స్వామి దేవాలయంలోని శివాలయంలో, ఆదోని బైపాస్ రోడ్డులోని శివాలయంలో, తేరు బజార్‌లోని శివాలయంలో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నందవరంలో పూజలు చేస్తున్న బీవీ

ఆదోనిలో పూజలు చేస్తున్న మీనాక్షి నాయుడు

హోళగుండలో...

కురువ చంద్రన్నను అదుపులోకి తీసుకున్న సిఐ శ్రీనివాసులు

చీటింగ్ కేసులో నిందితుని అరెస్టు

ప్రజాశక్తి - దేవనకొండ

చీటింగ్ కేసులో నిందితుని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని బండగట్టు గ్రామానికి చెందిన కురువ చంద్రన్న కోడుమూరు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సిబ్బందితో అనుకూలంగా ఉంటూ రైతుల పంట రుణాల రెన్యువల్, డిపాజిట్ తదితర లావాదేవీలు జరుపుతూ వడ్డీ పేరుతో సుమారు 25 మంది రైతుల నుంచి రూ.3.35 కోట్లు వసూలు చేసి రైతులకు కుచ్చుటోపి పెట్టి ఫిబ్రవరి 11న పరారైన విషయం విదితమే. ఈ మోసానికి పాల్పడిన కురువ చంద్రన్నను శుక్రవారం స్థానిక సిఐ శ్రీనివాసులు పోలీసు సిబ్బందితో అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు నిందితుని పత్తికొండ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు.

మహారాజశ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో

ఐ.పి నంబర్ 51/23

బైరెడ్డి శ్రీకాంత్ రెడ్డి. ...అర్జీదార్లు

వర్సెస్

ఏ.రవీంద్ర వగైరా. ...రెస్పాండెంట్లు

జనరల్ నోటీసు

కర్నూలు జిల్లా, కర్నూలు గ్రామ, నంది నగర్ ప్రజలకు తెలియజేయడం ఏమనగా పై నెంబరు I.P లో అర్జీదారు అయినా బైరెడ్డి శ్రీకాంత్ రెడ్డి తండ్రి బి.శ్రీనివాసరెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం, ఇంటి నెంబర్ 43/253సి1, రెండవ ఫ్లోర్ పరిమళ మాన్సిన్, నంది నగర్ కర్నూలు అనునతడు తనను దివాలా దారునిగా తీర్మానించమని కోరుతూ దివాలా అర్జీ దాకులు చేసినాడు. ఇందుపైన ఎవరికైనా ఆక్షేపణలు ఉన్న 13-03-2024వ తేదీ పగలు 10:30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేని ఎడల పరోక్ష మున విచారించి తీర్మానించబడును.

కోర్టు వారి ఉత్తర్వులు మేరకు

క్రిష్ణాశెట్టి,
కె. రామకృష్ణ,
అర్జీదారుపురం అడ్వకేట్లు,
కర్నూలు.

ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - ఆదోని

జీవనజ్యోతి ఆశ్రమంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ... ఆశ్రమ వృద్ధులతో మహిళా దినోత్సవం చేసుకోవడం సంతోషకరంగా ఉందని తెలిపారు. ఇద్దరు మహిళలను సన్మానించారు. అనంతరం అక్కడున్న వారందరికీ కేసరి (స్వీట్), కారా మిక్చర్ అందించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు నాగరాజ్, దినేష్, పవన్, యశ్వంత్ పాల్గొన్నారు. అలాగే ఆదోనిలోని ఎస్‌టియు భవన్‌లో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి మహిళా దినోత్సవం నిర్వహించారు. ఎస్‌టియు పట్టణ, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.రవి, భీమరాజు, రామకృష్ణ, సుధాకర్ బాబు మాట్లాడారు. ఎక్కడైతే మహిళలు గౌరవించబడతారో అక్కడ సమాజం సుఖసంతోషాలతో ఉంటుందని తెలిపారు. దేశాభివృద్ధిలో భాగస్వామ్యమయ్యేలా మహిళలకు అండగా ఉండాలన్నారు. స్త్రీలేని సమాజాన్ని ఊహించడమే కష్టమని, మనిషి ప్రతి దశలోనూ మహిళ భాగస్వామ్యం తప్పనిసరిగా ఉంటుందని తెలిపారు. ఎస్‌టియు రాష్ట్ర సహాధ్యక్షులు నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్ మహాదేవప్ప, జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ నాయుడు, జిల్లా ఆర్థిక కమిటీ సభ్యులు రామాంజనేయులు, బి.సత్యన్న, రాజా, సతీష్, ఈరన్న గౌడ్, సూర్యుడు, వెంకటేశ్వర్లు, వీరేష్, రామాంజనేయులు, గురురాజా, కోటి పాల్గొన్నారు. **ఆలూరు** మోడల్ స్కూల్‌లో ఎస్‌టియు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. మహిళా ఉపాధ్యా యులను, విరమణ పొందిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఎస్‌టియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.నాగరాజు మాట్లాడారు. దేశాభివృద్ధికి మహిళల పాత్ర కీలకమని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాల న్నారు. ఉపాధ్యాయులు మంజులమ్మ, మహా దేవమ్మ, సుధారాణి, ప్రహ్లాద్, విశ్రాంత ఉపాధ్యాయులు జయ్యమ్మ, రామలింగమ్మ, శ్రీకృష్ణ దేవరాయ స్కూల్ కరస్పాండెంట్ ప్రగతి, ప్రగతి స్కూల్ నిర్వాహకులు పద్మావతి, ఎస్‌టియు నాయ కులు రామ కృష్ణారెడ్డి, సూర్య నారాయణ, నాగ రాజు, విశ్రాంత ఉపాధ్యాయులు గోవిందప్ప, కవి ఈశ్వ రప్ప పాల్గొన్నారు.

అనాథలకు అన్నదానం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆలూరులో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు

దళిత యువకుని హత్య కేసును సిబిఐకి అప్పగించాలి

- సమతా సైనిక్ దళ్, మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

దేశంలోనే సంచలనం రేపిన దళిత యువకుడు సుబ్రహ్మణ్యం హత్య కేసును సిబిఐకి అప్పగించాలని, అనంతబాబును ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని సమతా సైనిక్ దళ్ రాయలసీమ జిల్లాల కన్వీనర్ రంగయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రజా సంఘాలు, మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి, సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో కర్నూలు అంబేద్కర్ భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా సమతా సైనిక్ దళ్ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సురేంద్ర బాబు, ఫరూక్ షబ్లీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 'నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు' అని చెప్పుకుంటారని తెలిపారు. దళిత జాతిపై హత్యలకు, హత్యాచారాలకు, మానభంగాలకు, ఆత్మహత్యలకు ఉసిగొలుపుతోంది జగనే అని, దానికి నిదర్శనం సుబ్రహ్మణ్యం హత్య డోర్ డెలివరీ అని దుయ్యబట్టారు. ఈ ఐదేళ్లలో వందల సంఖ్యలో దళితులు దాడులకు గుర య్యారని తెలిపారు. రాయలసీమ అధ్యక్షులు రంగయ్య మాట్లాడుతూ... అనంతబాబును ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేసి, కేసును సిబిఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. లేకపోతే సమతా సైనిక్ దళ్, మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో తాడేపల్లి జగన్ కార్యాలయాన్ని ముట్టడించి ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమవుతాయని హెచ్చరించారు. జగన్‌కు సమతా సైనిక్ దళ్ బలమేంటో కోడికత్తి శ్రీను విషయంలో అర్థమై ఉంటుందని తెలిపారు. తదుపరి కార్యాచరణపై రాష్ట్ర కమిటీతో నిర్ణయా లు తీసుకున్నామని తెలిపారు. జిల్లా అధ్యక్షులు మల్లేష్, నల్లన్న, బలరాం, తుకారాం, చిన్న రంగన్న, నరసప్ప, రమేష్, మల్లి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రంగయ్య

మహారాజశ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో

ఎస్.ఒ.పి. నెంబర్ : 1/24

గాజుల విజయభాస్కర్. ...అర్జీదారు

వర్సెస్

State Bank of India
Chief Manager Ibrahimpatnam,
Hyderabad.

Genaral Notice

కర్నూలు జిల్లా, కర్నూలు గ్రామం, ధర్మపేట ప్రజలకు తెలియజేయడమేమనగా పై నెంబరు S.O.Pలో బి.పద్మావతి 06-09-13వ తేదీ చనిపోయి నందున ఆమెకు అర్జీదారు గాజుల విజయభాస్కర్ తండ్రి లేట్ రామసుబ్బయ్య ఇంటి నెంబర్ 40/40-583-1-311 ప్లాట్ నెంబర్ 311 బి.బ్లాక్ థర్డ్ ఫ్లోర్ సూర్య టవర్స్ చల్లాకాంపౌండ్ కర్నూలు అనునతడు వారసులమని వారి సర్టిఫికెట్ ఇప్పించమని సదరు బి.పద్మవతి తాల్కు హైదరాబాద్ ఇబ్రహీంపట్నం SBI లో ఉన్న మొత్తము 10,99,046-00 తీసుకొనుటకు పర్మిషన్ ఇప్పించమని కోరుతూ అర్జీ దాఖలు చేసినాడు. ఇందుపైన ఎవరికైనా ఆక్షేపణలు ఉన్న 11-04-2024వ తేదీ పగలు 10:30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుపుకోవలెను. లేనియెడల పరోక్షమున విచారించి తీర్మానించబడును.

కోర్టువారిఉత్తర్వులు మేరకు

ఎం. అజమతుల్లా,
అర్జీదారుపరం అడ్వకేట్,
కర్నూలు.



కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు, చిత్రంలో ఎస్పి, జెసి

వైభవంగా శ్రీశైల బ్రహ్మోత్సవాలు

- కనుల పండువగా ప్రభోత్సవం, నంది వాహన సేవ, లింగోద్భవం, పాగాలంకరణ, స్వామి అమ్మవార్లకు కల్యాణోత్సవం - భక్తజనంతో కిక్కిరిసిన క్షేత్రం

ప్రజాశక్తి- శ్రీశైలం

మహాశివరాత్రిని పురస్కరించుకొని శ్రీశైలక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, ఒరిస్సా రాష్ట్రాలనుంచి యాత్రికులు లక్షలాది మంది పాల్గొన్నారు. శ్రీశైల క్షేత్రం భక్తుజన సందోహంతో కిటకిటలాడింది. సరయిన శానిటేషన్, తాగునీరు, ఎండనుంచి తట్టుకోవడానికి చేసిన ఏర్పాట్లు సక్రమంగా లేక యాత్రికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శ్రీశైలంతోపాటు మహానంది, యాగంటి, కాలువబుగ్గ, ఓంకార క్షేత్రాలలో మహాశివరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. శైవక్షేత్రాలు యాత్రికులతో కిక్కిరిసిపోయాయి.

శ్రీశైల మల్లన్న ఆలయ గోపురానికి పాగాలంకరణ

ప్రభోత్సవానికి భారీగా తరలి వచ్చిన భక్తజనం

నవాహ్నిక దీక్షతో పదకొండు రోజుల పాటు నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాలలో భాగంగా మహాశివరాత్రి రోజు శుక్రవారం ఎనిమిదవ రోజున స్వామి అమ్మ వార్లకు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలలో భాగంగా సాయంకాలం ప్రభోత్సవం వైభావంగా నిర్వహించారు. ఇందులో గంగాధర మండపం వద్ద ప్రభకు వివిధ పూలతో అలంకరించి స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయం నుండి పల్లకిలో తీసుకువచ్చి ప్రభలో ఏర్పాటు చేసి వివిధ రకాల కోలాటం, చెక్కబజన, వంటి రకరకాల కలాన్నృత్య ప్రదర్శనల మధ్య గంగాధర మండపం వద్ద నుండి నంది మండపం వరకు అక్కడ నుండి తిరిగి గంగాధర మండపం వద్దకు ప్రభోత్సవాన్ని వేదమంత్రాల మధ్య ఘనంగా నిర్వహించారు.

నంది వాహన సేవలో స్వామి అమ్మవార్లు: ఉత్సవాలలో భాగంగా ఆలయ ప్రాంగణంలోని అలంకారం మండపంలో స్వామి అమ్మ వాళ్ళ ఉత్సవమూర్తులను వివిధ పూలతో అలంకరించిన నంది వాహనంపై ఏర్పాటుచేసి విశేష పూజలు నిర్వహించారు.ఆ తర్వాత ఆలయ ప్రాంగణంలో నంది వాహన సేవా కార్యక్రమాన్ని మంగళ వాయిద్యాలతో వేదమంత్రాలు మధ్య నిర్వహించారు.

లింగోద్భవ కాల మహా రుద్రాభిషేకం: మల్లికార్జున స్వామికి ప్రధాన ఘట్టమైన ఈ కార్యక్రమం రాత్రి 10 గంటల నుండి 11 మంది అర్చకులు చేత నాలుగు గంటల పాటు రుద్రమంత్రాల మధ్య లింగోద్భవ కాల మహా రుద్రాభిషేకం మల్లికా గుండంలోని జలంతోను పంచామృతాలతోనూ పలు పలోదకాలతోనూ నిర్వహించారు.

పాగాలంకరణ : స్వామి వారికి లింగోద్భవ కాల మహా రుద్రాభిషేకం ప్రారంభమైన వెంటనే పాగాలంకరణ ప్రారంభమైంది. బ్రహ్మోత్సవాలలో జరిగే ఈ పాగాలంకరణకు ఓ ప్రత్యేకత ఉంది. వివాహాలలో పెళ్లి కుమారుడికి తలపాక చుట్టడం సంప్రదాయం, ఆ ఆచారం ప్రకారం శ్రీశైలం ఆలయంలో పాగాలంకరణ పేరుతో ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ పాగా స్వామివారి విమాన గోపురం నుండి ముఖ మండపంపై ఉండే నందులను అనుసంధానం చేస్తూ కడతారు. పాగాలను సమర్పించే భక్తులు నియమ, నిబంధనలతో కూడి రోజుకు ఒక మూర చొప్పున సంవత్సరం పొడవునా 365 రోజులు 365 మూరలతో ఈపాగా తయారు చేస్తారు. ఈ విధంగా నేసి తెచ్చిన పాగాను అలంకరించే వ్యక్తి దిగంబరుడై పాగాను అలంకరించాడు. అలంకరించే సమయంలో అలంకరించే వ్యక్తి దిగంబరుడై ఉన్నందున అక్కడున్నటువంటి విద్యుత్ దీపాలకు విద్యుత్ సరఫరా నిలిపేశారు. ప్రకాశం జిల్లా చీరాల హస్తినాపురం గ్రామానికి చెందిన పధ్వి వెంకటేశ్వర్లు తనయుడు ఈ పాగాను అలంకరించారు. ప్రకాశం జిల్లా నుండి 4, బాపట్ల జిల్లా నుండి ఏడు, శ్రీకాకుళం జిల్లా నుండి ఆరు, విజయనగరం జిల్లా నుండి 3, కోనసీమ జిల్లా నుండి ఆరు, పశ్చిమగోదావరి జిల్లా నుండి రెండు, కృష్ణాజిల్లా నుండి ఒకటి, తిరుపతి జిల్లా నుండి ఒకటి, పొరుగు రాష్ట్రమైన ఒరిస్సా నుండి ఒకటి, పాగాలని సమర్పించారు.

స్వామి అమ్మవార్లకు ప్రత్యేక కళ్యాణం : మహాశివరాత్రి సందర్భంగా రాత్రి 12 గంటలకు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కళ్యాణోత్సవంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. వేదమంత్రాలు మధ్య లోక కళ్యాణాన్ని కాంక్షిస్తూ కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు.

బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఘనమైన ఏర్పాట్లు

- కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి యుద్ధ ప్రాతిపదికన సేవలు - జిల్లా కలెక్టర్ కె. శ్రీనివాసులు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం క్షేత్రంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా ఘనమైన ఏర్పాట్లు ఉండాలని జిల్లా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు, జిల్లా ఎస్పి కె.రఘు వీర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ టి. రాహుల్‌కుమార్ రెడ్డిలు అధికారులను శుక్రవారం ఆదేశించారు. దేవస్థానం కంట్రోల్ రూము నుండి 12 జోన్లుగా విభజించి శ్రీశైలం క్షేత్రాన్ని పరిశీలిస్తూ ఎక్కడ ఎలాంటి చిన్న సంఘటనలు చోటు చేసుకున్నా నియమించిన ఉన్నతాధికారుల నుంచి వివరాలను తెలుసుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నారు. ప్రధానంగా పారిశుద్ధ్యం, త్రాగునీరు, పార్కింగ్ ప్రదేశాలు, భక్తుల ఉచిత దర్శన క్యూలైన్లు, లడ్డు ప్రసాద కౌంటర్లు, శివదీక్షా శిబిరాలు, ఉద్యానవనాలు తదితర ముఖ్య ప్రదేశాలలో రద్దీ చోటు చేసుకోకుండా తమ సూచనలు ఇవ్వాల్సిందిగా సంబంధిత అధికారులకు వారు ఆదేశాలు జారీ చేశారు. పారిశుద్ధ్యానికి సంబంధించి అన్ని జోన్లలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కలెక్టర్ డీపీఓను ఆదేశించారు. క్షేత్రపరిధిలోని అన్ని ప్రాంతాలలో దాదాపు వెయ్యి మందికిపైగా పారిశుద్ధ్య కార్మికులతో మూడు షిఫ్టులలో నిరంతరాయంగా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా సింటెక్సు ట్యాంకులను ఎప్ప టికప్పుడు నీటితో నింపుతూ భక్తులకు అందుబాటులో ఉంచాలని దేవస్థాన అధికారులను ఆదేశించారు. అలాగే శ్రీశైలక్షేత్ర పరిధిలో 13 చోట్ల తాత్కాలిక అత్యవసర ప్రథమ చికిత్స కేంద్రాలతో పాటు 30 పడకల ఆసుప్రతి ఏర్పాటు చేసి భక్తులకు కల్పిస్తున్న వైద్యసదుపాయాలపై కలెక్టర్ ఆరా తీసారు. పాగాలంకరణకు సంబంధించి చేస్తున్న ఏర్పాట్లపై పరిశీలిస్తూ భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని దేవస్థాన ఈవోను కలెక్టర్ ఆదేశించారు. అలాగే స్వామివార్ల కళ్యాణోత్సవానికి కూడా పటిష్ట ఏర్పాట్లు చేసుకుని భక్తులు వీక్షించేలా అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

భద్రత ఏర్పాట్లను పరిశీలించిన డిఐజి

బ్రహ్మోత్సవాల పటిష్ఠ భద్రత ఏర్పాట్లను, భద్రత చర్యలను కర్నూలు రేంజ్ డిఐజి, సిహెచ్ విజయరావు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. సాధారణ భక్తులు అందరూ దైవదర్శనం చేసుకునేలా క్యూలైన్లు త్వరగా ముందుకు సాగేలా స్వయంగా జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డితో కలిసి పరిశీలించి అక్కడి సిబ్బందికి తగు సూచనలు చేశారు. అనంతరం దేవస్థానం చుట్టుప్రక్కల, క్యూలైన్లలో ఏర్పాటు చేసిన 568 సిసి కెమెరాల పనితీరును 24/7 వాటిని గమనిస్తూ ఉండాలని ఆదేశించారు. ఏఎస్‌పి ప్రవీణ్ కుమార్, ఆత్మకూరు డిఎస్‌పి శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పి సంతోష్, ఇన్స్పెక్టర్ చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు.

ఏం చేసిందని బిజెపితో పొత్తు ?

- టిడిపి, జనసేన పార్టీలు రాష్ట ప్రజలకు చెప్పాలి : సిపిఎం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరరావు

రాష్ట్రానికి ఏం చేసిందిన బిజెపితో టిడిపి, జనసేన పార్టీలు పొత్తుకు వెంపర్లాడుతున్నాయని రాష్ట్ర ప్రజలకు చెప్పాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం నందికొట్కూరు పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ ప్రజా సంఘాల నాయకులు పి పకీర్ సాబ్, ఎం కర్ణ, నాగన్న, డక్క కుమార్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజన హామీలు అమలు చేయకుండా, పోలవరం జాతీయ ప్రాజెక్టుకు పూర్తి చేయకుండా, అమరావతి రాజధానికి, కడప స్టీల్ ప్లాంట్‌కు నిధులు కేటాయించకుండా, ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తున్న నరేంద్ర మోడీ బిజెపితో పొత్తు పెట్టుకోవడం రాష్ట్ర ప్రజలను మోసం చేయడం తప్ప మరొకటి కాదన్నారు. బిజెపి పల్లకి మోసేందుకు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఎన్నికల ముందు స్వామినాథన్ కమిషనర్ సిఫారసులను అమలుచేసి రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు పార్లమెంటులో చట్టబద్ధత కల్పిస్తామని, ప్రతి సంవత్సరం ఉద్యోగాలు ఇస్తామని, ధరలను వంద రోజుల్లో అదుపు చేస్తామని అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని హర్యానా పంజాబ్ ఢిల్లీ సరిహద్దుల్లో ఆందోళన చేస్తున్న రైతులపైన పోలీసులతో కాల్పులు జరిపి హత్య చేసినందుకు పొత్తు పెట్టుకుంటున్నారా ?అని వారు ప్రశ్నించారు. ప్రభుత్వ రంగాలను ప్రైవేటీకరణ చేసి నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తున్నందుకు బిజెపితో పొత్తు పెట్టుకుంటున్నారా అని వారు ప్రశ్నించారు, ఎన్ఆర్‌సి, సిఏఏ తీసుకొని వచ్చి ముస్లింలను ఈ దేశం నుంచి వెళ్లగొట్టేందుకు ప్రయత్నం చేస్తున్న నరేంద్ర మోడీతో పొత్తు పెట్టుకుంటున్నారా ఏ ప్రతిపాదికన బిజెపితో టిడిపి జనసేన పొత్తు పెట్టుకుంటుందో ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు, రైతాంగానికి దళితులకు ముస్లింలకు సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

పాలుట్ల రంగస్వామి దేవాలయం అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

విద్యాలయాల అభివృద్ధికి కృషి

- ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

ప్రజాశక్తి - బేతంచెర్ల

విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు విద్యాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం బేతంచెర్ల మండలం గోరుమాను కొండ గ్రామంలో రూ.26 కోట్లతో పాలిటెక్నిక్ కళాశాల నిర్మాణం కోసం ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, దానికి సంబంధించిన పైలాన్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులతో మంత్రి బుగ్గన ముచ్చటించారు. వెనుకబడిన ప్రాంతంలో సకల సదుపాయాలు, అత్యాధునిక వసతులతో ఇంత గొప్ప విద్యాలయాలు నిర్మించిన మంత్రి బుగ్గన కషికి విద్యార్థులు రూప, రజనీప్రియ, జగదీష్ కృతజ్ఞతలు తెలిపారు. చదువుకోడానికి దూరంగా వెళ్లాలంటే ఎన్నో ఇబ్బందులు పడే తమలాంటి బాలికలకు స్థానికంగానే కళాశాల ఏర్పాటు చేసినందుకు ఎప్పటికి రుణపడి ఉంటామన్నారు. విద్యార్థుల చదువులు, ఎక్కడి నుంచి వచ్చారు అన్న వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడల పట్ల కూడా ఆసక్తి పెరిగేలా ప్రోత్సహించాలని మంత్రి ప్రిన్సిపల్‌ను సూచించారు. ఉన్నతమైన చదువులు చదివి గొప్ప స్థాయికి చేరాలన్న ఆకాంక్షతో ఐటిఐ, బిసి రెసిడెన్షియల్ స్కూల్, పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు చేశామని అందుకు మంచి గుర్తింపు తీసుకువచ్చి ఉపాధ్యాయ ధర్మాన్ని నిర్వహి ంచాలని అన్నారు. బేతంచెర్ల పట్టణంలో రూ.78లక్షలతో సరికొత్తగా తీర్చిదిద్దిన ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌ను ప్రారంభించారు. బేతంచెర్ల పట్టణంలో కొత్తగా నిర్మించిన 'రైల్ రోడ్ రెసిడెన్సీ' లాడ్జను ప్రారం భించారు. వెల్దుర్తి మండలంలోని పాలుట్ల రంగస్వామి ఆలయ అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవితో కలిసి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు రహ దారి మార్గం ప్రస్తుత పరిస్థితిని పరిశీలించేందుకు అత్యం త క్లిష్టమైన రాళ్లదారిలో మంత్రి ప్రయాణిస్తూ పాలుట్ల స్వామి క్షేత్రానికి చేరుకు న్నారు. రూ.1.10 కోట్లతో తీర్చిదిద్దనున్న ఆలయాభివృద్ధి పనులకు సంబంధించిన పైలాన్‌ను మంత్రి బుగ్గన ఆవిష్కరించారు. బేతంచెర్ల సరిహద్దు గ్రామం గూటుపల్లి నుంచి పాలుట్ల ఆలయానికి చేరే రోడ్డు మార్గాన్ని రూ.6.50 కోట్లతో చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు.

వైసిపిలో చేరిన వందకుటుంబాలు: అభివృద్ధికి చిరునామాగా మారిన బుగ్గన నాయకత్వంలో పని చేయాలనే తాము వైసిపిలో భాగస్వామ్యం అవుతున్నట్లు కొలములపల్లె గ్రామస్తులు పేర్కొన్నారు. డోన్ నియోజకవర్గం సామాన్య ప్రజలకు అవసరమైన విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు, ఆలయాల అభివృద్ధి, పర్యాటక వసతుల ఏర్పాటుతో సమగ్రాభివద్ధి చెందిందన్నారు. అందరూ మరోసారి పేద ప్రజల ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే దిశగా కలిసి పని చేయాలని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. బేతంచెర్ల ఎంపిపి నాగభూషణం రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ చలంరెడ్డి, బేతంచర్ల వైసిపి నాయకులు బాబుల్ రెడ్డి, ఎంపిటిసి రామనాథం ఆర్‌డిఒ మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

మరోసారి అవకాశం కల్పించండి

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

ప్రజాశక్తి - అవుకు

2024 సార్వత్రిక ఎన్నికల్లో బనగానపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యేగా మరోసారి గెలిపించాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కోరారు. శుక్రవారం అవుకు మండలంలోని సింగనపల్లి గ్రామంలో ఒక కోటి 24 లక్షల రూపాయలతో చేసిన అభివృద్ధి పనులను ఎంపీపీ చల్ల రాజశేఖర్ రెడ్డి, యువ నాయకుడు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాలకు తలమానికంగా సచివాలయం రైతు భరోసా వైయస్సార్ హెల్త్ క్లినిక్ లు,సీసీ రోడ్లతో గ్రామాలు కలకలలాడుతున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రతి ఒక్కటి 100% మేరా నెరవేర్చడం జరిగిందని తెలిపారు. మరొక్కసారి రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే వైఎస్ఆర్ పార్టీ అధికారంలోకి రావాలని ప్రజలను కోరారు. సింగనపల్లెకు మజార గ్రామమైన ఓబులాపురం గ్రామంలో 42 లక్షలతో సీసీ రోడ్డు ఓవర్ హెడ్ ట్యాంకును ప్రారంభించారు. అనంతరం 64 మంది మహిళల లబ్ధిదారులకు ఇంటి పట్టాలను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ మండల కన్వీనర్ కాటసాని త్రిపాల్ రెడ్డి యువ నాయకుడు కాటసాని ఓబుల్ రెడ్డి, స్థానిక నాయకులు పుల్లారెడ్డి, గుర్రాల సుదర్శన్,గ్రామ సర్పంచు పరశురాముడు,మండల స్థాయి అధికారులు వైయస్సార్ పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట

- త్వరలో డయాలసిస్ మిషన్
- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. శుక్రవారం సున్నిపెంట ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలోని నూతన వైద్యశాలలో బ్లడ్ బ్యాంకును ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం వైద్యానికి పెద్దపీట వేస్తోందన్నారు. సుండీ పెంట ప్రభుత్వ వైద్యశాలలో సమస్యలను ప్రభుత్వ వైద్య కమిషనర్, డిడిఓతో మాట్లాడి సమస్యలను ఓ కొలిక్కి తెస్తున్నానని తెలిపారు. గతంలో కూడా ఈ నూతన వైద్యశాలలో కరోనా సమయంలో క్వారంటైన్ సెంటర్‌ను ఏర్పాటు చేసి ఎందరో ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా చేశామన్నారు. ప్రస్తుతం వైద్యశాలలో ఆరు మంది డాక్టర్లు అందుబాటులో ఉంటూ వైద్యం అందిస్తున్నారని,ముఖ్యమైన పర్వదినాలలో భక్తులు ఇతర రాష్ట్రాల నుండి వస్తుంటారని వేళగాని వేళలు చూడకుండా వైద్యం అందించాలన్నారు. అలాగే ల్యాబ్ లో 52 రకాల రోగాల వరకు వైద్య పరీక్షలు నిర్వహించే విధంగా అందుబాటులో ఉన్నాయన్నారు. ఏదైనా అత్యవసర సమయంలో రక్తానికి ఇబ్బంది లేకుండా రక్తనిధిని ఏర్పాటు చేయడం మంచి శుభ పరిమాణం అని అన్నారు. ఈ మధ్యకాలంలో సున్నిపెంట కాటికాపరి కూతురు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న అమ్మాయికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 21 లక్షల సహాయం అందించిన దురదృష్టవశత్తు అమ్మాయి మరణించడం చాలా బాధాకరమన్నారు. వైద్యశాలలో డయాలసిస్ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక గది ఏర్పాటు చేసి దాతల సహాయంతో డయాలసిస్ మిషన్ను త్వరలో ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. మండలంలో దాదాపు 30 మంది వరకు కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఉన్నారని దృష్టికి వచ్చిందని, ఎవరు ఏఏ సమయంలో డయాలసిస్ చేసుకుంటారో వారి పూర్తి వివరాలు సేకరించి డయాలసిస్ మిషన్ ఏర్పాటు చేయిస్తాం అన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో ఉన్న రోగులను పలకరించి వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకు న్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డాక్టర్లు, స్థానిక వైసీపీ నాయకులు ఎం.ఏ. రజాక్, భరత రెడ్డి,గుండయ్య యాదవ్, దానియేలు, గౌస్ మొహిద్దీన్,వైద్య శాల సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

బ్లడ్ బ్యాంకు ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ

పజాశక్తి - రుద్రవరం

మండలం పరిధిలోని. తిప్పారెడ్డిపల్లి లింగమయ్య స్వామి ఆర్చి దగ్గర సుమారు రూ3.5 కోట్ల వ్యయంతో నూతన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో నంద్యాల డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ రమణారెడ్డి, కన్స్ట్రక్షన్ డిఈ రాజేష్, ఆళ్లగడ్డ అసిస్టెంట్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్. డి రవికాంత్ చౌదరి, రుద్రవరం అసిస్టెంట్ ఎలక్ట్రికల్ ఇంజనీర్. జీ రాఘవేంద్రారెడ్డి, మండల విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ అధికారులు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయడం వలన నాణ్యమైన విద్యుత్ రైతులకు ఇవ్వడం జరుగుతుందని, రుద్రవరం, ఆలమూరు సబ్ స్టేషన్ లకుఓవర్ లోడ్ సమస్య తగ్గుతుందన్నారు. తిప్పారెడ్డి పల్లి గ్రామానికి చెందిన చాబోలు రమణయ్య అనే రైతు సర్వేనెంబర్ 16 /1 లో 0.55 ఎకరాల భూమిని దానంగా ఇచ్చారన్నారు. దీంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో అధికారులు విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి విద్యుత్ అధికారులు భూమి పూజ నిర్వహించడం జరిగిందన్నారు. త్వరలోనే సబ్ స్టేషన్ నిర్మాణము పూర్తి అయితే తిప్పారెడ్డిపల్లి, ఆర్ నాగులవరం టి లింగం దిన్నె, చందలూరు ముత్తలూరు, నక్కలదిన్నె, నల్లవాగుపల్లి, తదితర గ్రామాలకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు వీలవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి తన భూమిని దానంగా అందజేసిన తిప్పారెడ్డి పల్లి గ్రామానికి చెందిన కాబోలు రమణయ్య, ఆయన కుమారులు మోహన్, రాజేష్, విద్యుత్తు కాంట్రాక్టర్ రజాక్ మియా, విద్యుత్ సిబ్బంది పలువురు గ్రామస్తులు రైతులు విద్యుత్ సబ్ స్టేషన్ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యుత్ సబ్వేషన్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న విద్యుత్ అధికారులు

ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి

రాష్ట్రంలో విధ్వంస పాలన

- డోన్ అసెంబ్లీ టిడిపి అభ్యర్థి కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి

ప్రజాశక్తి-డోన్

ఒక్క ఛాన్స్ పేరుతో వైసిఇప అధికారంలోకి వచ్చి విధ్వంస పాలన సాగిస్తోందని ఆ పార్టీని బంగాళాఖాతంలో కలిపేసేందుకు ప్రజల సిద్ధంగా ఉన్నారని కేంద్ర మాజీ మంత్రి,డోన్ అసెంబ్లీ టిడిపి అభ్యర్థి కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 13,19 వార్డులలో ఆయనతో పాటు తనయుడు కోట్ల రాఘవేంద్రారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుకే ఓటేసి టిడిపిని గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ అధికారాన్ని అడ్డం పెట్టుకొని రాష్ట్ర సంపదను ఇష్ట రాజ్యాంగ దోచేశారని ఆరోపించారు జగన్ ఐదేళ్లలో బటన్ నొక్కడం తప్ప ప్రజలకు చేసిన అభివృద్ధి ఏమి లేదన్నారు. వైసిపి అరాచకాలకు ముగింపు పలికే సమయం ఆసన్నమైనదని రాబోయే ఎన్నికలలో అరాచక ప్రభుత్వాన్ని ఓడించడం ఖాయమని కోట్ల ధీమా వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్ర ప్రజలకు ఉజ్వల భవిష్యత్తు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టి.యి.కేశన్నగౌడ్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొట్రికే పణిరాజ్, ఓబులాపురం శేషిరెడ్డి,మర్రి రమణ,ఎరుకలచెరువు శివ,శీలంభాస్కర్ నాయుడు,శీలం చంద్రశేఖర్ నాయుడు,తోట మనోహర్, టీయి. రాఘవేంద్ర గౌడ్,మర్రిమణి, శ్రీనివాసభట్టు,చిట్యాల మద్దయ్య గౌడ్, చిట్యాల రఘుగౌడ్, చంద్రపల్లె వెంకటరమణ ఆచారి,చాటకొండ ఓంప్రకాష్,ధర్మవరం సంజీవుడు,అలేబాద్ పరమేష్,అన్వర్ భాష,జయరాముడు,జనసేననాయకులు అలా మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత సాధించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-డోన్ : మహిళా సాధికారత సాధించాలని యుటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.వెంకటసుబ్బారెడ్డి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బివై సుబ్బారాయుడులు అన్నారు. శుక్రవారం డోన్ పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బివై సుబ్బారాయుడు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎం.వెంకట సుబ్బారెడ్డి,మండల ప్రధాన కార్యదర్శి గోపాల్,పూర్వ జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బివై.సుబ్బారాయుడు లు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని,మహిళలు స్వతంత్ర భావాలతో అడుగులు వేస్తూ ముందుకు సాగాలని సూచించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతమ్మ, యుటిఎఫ్ మహిళా కార్యదర్శి లీలావతమ్మ, సీనియర్ కార్యకర్త హుసేనమ్మ,పూర్వ మహిళా కన్వీనర్ గ్రేసమ్మలను సన్మానించారు. సీనియర్ నాయకులు వెంకటలక్ష్మీ, ఎస్తేరమ్మ,రాధ, భారతి,లక్ష్మీ ప్రభావతి,హుస్సేన్ భాను, సుబ్బారాయుడు, రమేష్, రఘునాథ్,మద్దిలేటి పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న డోన్ యుటిఎఫ్ నాయకులు

ఆలయ నిర్మాణానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - రుద్రవరం

మండల కేంద్రానికి చెందిన బైసాని పెద్ద పుట్టాలు కుమారుడు రవి ప్రసాద్ ఎల్లమ్మ దేవత గుడి నిర్మాణానికి రూ 20వేల ఆర్థిక సహాయాన్ని ఆలయ నిర్వా హకులకు అందజేశారు. శుక్రవారం రుద్రవరం పొలిమేరలో నూతనంగా నిర్మిస్తున్న ఎల్లమ్మ దేవత ఆలయ నిర్మాణానికి తన వంతు సాయంగా ఆలయ నిర్వాకులు కమతం తాటి రెడ్డికి విరాళం అందించారు. కార్యక్రమంలో మెడికల్ స్టోర్ శ్రీనివాసులు రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న దాతలు

ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ వద్ద జనార్ధన్ రెడ్డి, టిడిపి కార్యకర్తలు

భూమా అఖిలప్రియ విజయానికి కృషి

- చెన్నా రెడ్డి గారి జనార్దన్ రెడ్డి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డలో టిడిపి అభ్యర్థి అఖిలప్రియను గెలిపించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని టిడిపి సీనియర్ నాయకులు చెన్నా రెడ్డి గారి జనార్దన్ రెడ్డి అన్నారు. సిరివెళ్ల మండల పరిధిలోని గంగవరం గ్రామంలో టీడీపీ సీనియర్ నేత చెన్నారెడ్డి గారి జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో భాబు ష్యూరిటి భవిష్యత్తూ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాల ఫ్లెక్సీ పోస్టర్ను ఆవిష్కరించారు. అనంతరం సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేస్తూ భూమా అఖిలప్రియను గెలిపించాలని కోరారు. చెన్నా రెడ్డి గారి జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ సర్పంచ్, టిడిపి శ్రేణులు, వార్డు మెంబర్లు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కష్టపడుతూ అఖిల ప్రియ విజయానికి కృషి చేయాలని సూచించారు.

తిమ్మనపల్లిలో తాగునీటి కష్టాలు

- కిలోమీటర్ల దూరం వెళ్లి తెచ్చుకుంటున్న వైనం
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయని అధికారులు
- తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి

పంట పొలాల నుంచి మోటార్ సైకిల్ ద్వారా తాగునీటిని బిందెలతో తెచ్చుకుంటున్న దళితులు

పంట పొలాలలో తాగునీటి కోసం బోరుబాలు దగ్గర వేచి ఉన్న గ్రామస్తులు

ప్రజాశక్తి - రుద్రవరం

ఈ ఏడాది వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో నీటి నిల్వలు లేక గ్రామాలలో భూగర్భ జలాలు అడుగంటి బోరు బావుల్లో నీరు లేక గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటికి ప్రజలు అష్టకష్టాలు అనుభవిస్తున్నారు. కిలోమీటర్ల దూరం వెళ్లి వాహనాలు ఆటోలు మోటార్ సైకిళ్ళు భుజాల మీద తాగునీటిని తెచ్చుకో వలసిన పరిస్థితులు నెలకొన్నాయి. రుద్రవరం మండలంలోని తిమ్మనపల్లి గ్రామంలో గుక్కెడు నీటి కోసము కిలోమీటర్ల దూరం వెళ్లి పంట పొలాల్లో ఉన్న బోరు బావులు దగ్గర నీటిని తెచ్చుకోవలసిన పరిస్థితులు నెలకొన్నాయి. వివరాల్లోకెళితే రుద్రవరం మండలంలోని తిమ్మనపల్లి గ్రామంలో దాదాపు 66 దళిత కుటుంబాలు జీవిస్తున్నాయి. 500 పైగా జనాభా కలిగిన ఈ గ్రామంలో గత 10 రోజుల నుంచి తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. గ్రామంలో ఉన్న రక్షిత మంచినీటి సరఫరా బోరుబావులకు భూగర్భ జలాలు అడుగంటి నీరు అందకపో వడంతో గ్రామస్తులకు తాగునీరు సరఫరా కావడం లేదు. దీంతో గ్రామస్తులు కిలోమీటర్ల దూరం వెళ్లి పంట పొలాల్లో ఉన్న వ్యవసాయ బోరుబావుల దగ్గర తాగునీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు ప్రజల దహార్తిని తీర్చేందుకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో గ్రామస్తులు పిల్లాపాపలతో కిలోమీటర్ల దూరం వెళ్లి ఆటోలు, మోటార్ సైకిళ్ళు, భుజాల మీద బిందెలతో తాగునీటిని తెచ్చుకుంటున్నారు. విద్యుత్తు సరఫరా లేని సమయంలో తాగడానికి నీరు లేక ఎన్నో ఇబ్బందులు పడాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల స్పందించి వెంటనే తిమ్మనపల్లి గ్రామంలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

బిందెలతో తెచ్చుకుంటున్న గ్రామస్తులు

సిఆర్‌పిఎఫ్ పోలీసుల కవాతు

ప్రజాశక్తి - బనగానపల్లె : మండలంలోని నందివర్గం గ్రామంలో సిఆర్పిఎఫ్ పోలీసులు ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా స్వేచ్ఛాయుతంగా ఓటు వేయాలని పోలీస్ కవాతు నిర్వహించారు. శుక్రవారం నందివర్గం గ్రామంలో సిఐ గంటా సుబ్బారావు నందివర్గం ఎస్సై తిరుపాల్ ఆధ్వర్యంలో సిఆర్పిఎఫ్ జవాన్‌లో కవాతు నిర్వహించారు.

IN THE COURT OF SENIOR CIVIL JUDGE, DHONE.

E.P. No. 20/2023 IN OS No. 475/2014

A. SATHYANARAYANA SINCE DIED REP. BY HIS LEGAL HEIRS
A. LAKSHMI DEVAMMA & 3 OTHERS ... Dhrs

Vs

B. SREENIVASULU,
S/o. B. MAHANANDAIAH,
H.No. 8-1-189-21,
Opp. Sri rama Talkies,
DHONE - 51822. -JDr

NOTICE TO JDR U/ORDER 21, RULE-54

పై అమలు దావా నందు డిక్రీ హోల్డర్ తనకు రావలసిన డిక్రీ డబ్బు రాబట్టు కానుటకు వేలం ద్వారా క్రింది దాఖలా ఆస్థిని జప్తు కోరి పై కోర్టు నందు అర్జీదాఖలు చేసియున్నాడు. సదరు దావా నందు నీకు ఈ నోటీసు పత్రికాముఖంగా తెలియజేయడం ఏమనగా పై కోర్టు వారు విచారణ 11-3-2024 వ తేదీని నిర్ణయించినారు. కావున నీవుగాని, నీ వకీలు ద్వారా గాని ఉదయము 10.30 గంటలకు పై కోర్టు ఆఫీసు నందు హాజరు కావలసియున్నది. అట్లు లేని ఎడల నీ పరోక్షమున తీర్మానించబడును.

షెడ్యూలు

నంద్యాల డివిజన్, డోన్ సబ్ డివిజన్, డోన్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న సర్వే నంబరు 280/1లో కల ఇంటి నెంబరు 9/60 కె.వి.ఎస్. కాలనీలోని ఇంటి హద్దులు
తూర్పు : బి. విజయలక్ష్మి ఇల్లు : పడమర:రోడ్డు
ఉత్తరము: కె.ఎస్.జవహర్ ఇల్లు:
దక్షిణం : కె.వి.దేవిప్రియ ఇల్లు
ఇంటికొలతలు: తూర్పు-పడమర-31 అడుగులు
ఉత్తరము-దక్షిణం-17 అడుగులు
మొత్తము 58.55 చదరపు గజాలు
మద్రాస్ టెర్రస్ నిర్మాణము కొతలు
తూర్పు-పడమర-24 అడుగులు
ఉత్తరము-దక్షిణము-17 అడుగులు
మొత్తము 408 చదరపు అడుగులు

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

ఇట్లు
ఆలా.శ్రీధర్, అడ్వకేటు,
డోన్. నంద్యాల జిల్లా.
సెల్ : 9396300365

ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి, జయమ్మ కోడలు మేధా శ్రీ రెడ్డిలు

కేక్ కట్ చేస్తున్న బీసీ ఇందిరా

కేక్ కట్ చేసి చిన్నారులకు తినిపిస్తున్న నాగిని రవి సింగారెడ్డి

ప్రజాశక్తి - విలేకరులు

బనగానపల్లె : బనగానపల్లె పట్టణంలోని పొదుపు భవనంలో మహిళా దినోత్సవాన్ని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సతీమణి కాటసాని జయమ్మ, కోడలు కాటసాని మేధా శ్రీ రెడ్డి ఘనంగా నిర్వహి ంచారు. శ్రీ వీరబ్రహ్మేంద్ర మహిళా సమాఖ్య సంఘం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాటసాని జయమ్మకు, కాటసాని మేధా శ్రీ రెడ్డిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నూర్ బాషా రాష్ట్ర కార్పోరేషన్ డైరెక్టర్ ముర్తుజాబి, మండల అధ్యక్షురాలు మానసవీణ, ఉపాధ్యక్షురాలు మంగవరపు లక్ష్మీదేవి, ముబినా షమీం, వైసిపినాయకులు డాక్టర్ మహమ్మద్ హుస్సేన్, ఈశ్వర్ నాయక్, కోఆప్షన్ మెంబర్ అనిల్, వెలుగు ఏపిఎం తిరుపాల్ రెడ్డి, మహిళ మండలి సమాఖ్య నాయకురాలు ,మహిళలు పాల్గొన్నారు. **బనగాపల్లె తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా కేక్ కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. మహిళలతో కలిసి ఆటపాటలతో సందడి చేశారు. వివిధ పోటీలు నిర్వహించి మహిళలతో ఉల్లాసంగా గడిపారు. బీసీ ఇందిరా మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం ప్రకటించిన మహాశక్తి పథకాలతో మహిళలు సంపూర్ణ సాధికారిత సాధిస్తారని తెలిపారు. అనంతరం ఆటపాటలలో గెలిచిన మహిళలకు బీసీ ఇందిర రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు.

మహిళలు ముందుకు రావాలి : చైర్మన్ ఆసియా

ఆత్మకూరు : మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని ఆత్మకూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారుఫ్ ఆసియా అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా మెప్మా కార్యాలయంలో నిర్వహించిన వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో అనేక మంది మహిళలు ఉన్నత స్థానాల్లో నిలిచారని వారందరి స్ఫూర్తితో మహిళలు అందరూ ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హరి ప్రసాద్, మెప్మా సి.ఈ.వో హుస్సేన్ బీ, పొదుపు మహిళా నాయకురాలు శాఫివున్ తదితరులు పాల్గొన్నారు. **టిడిపి ఆత్మకూరు కార్యాలయంలో ...** ఆత్మకూరులోని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ఆదేశాల మేరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడబుతూ చంద్రబాబు స్వతహాగా మహిళా పక్షపాతి అని, మహిళల రక్షణ, ఆర్థిక స్వావలం బనకు ఆయన తీసుకున్న నిర్ణయాలే అందుకు నిదర్శనమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకు రాల్లు సరోజమ్మ, వెంకట లక్ష్మమ్మ, శిరీష, విజయమ్మ, లక్ష్మి దేవమ్మ, పర్వీన్, ఉమా, సత్తెమ్మ, పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా, నాయకులు సుబ్బా రాజు, పెద్దన్న తదితరులు ఉన్నారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్నారు: నాగిని రవి సింగారెడ్డి

నంద్యాల కలెక్టరేట్ : మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, మహిళలు లేని రంగమంటూ లేదని, మహిళలు సాధికారత సాధించినపుడే సమాజం, రాష్ట్రం, దేశం పురోభివృద్ధి సాధిస్తుందని ఎమ్మెల్యే సతీమని శిల్పా మహిళా సహకార్ బ్యాంక్ చైర్ పర్సన్ నాగిని రవి సింగారెడ్డి పేర్కొన్నారు. దినోత్సవంను పట్టణ శివారులోని పరివర్తన లైఫ్ సెంటర్ నందు రూరల్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నాగిని రవి సింగారెడ్డి హాజరై కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం నిర్వాహకులు నాగిని రవి సింగారెడ్డిని ఘనంగా సన్మానించారు. పరివర్తన లైఫ్ సెంటర్ నిర్వాహకులు, మాజీ కౌన్సిలర్ ఆనీరేచల్, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు, రసూల్, గన్ని బ్యాగ్స్ సేక్ష మహిళలు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం నందు నంద్యాల జిల్లా దివ్యాంగుల హక్కుల పోరాట సంఘం ఆధ్వర్యంలో ఏం.నాగన్న అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు డాక్టర్. అభిరా , డాక్టర్.హిమవర్షిణి మాట్లాడుతూ మహిళలు విద్యావం తురాలైనప్పుడే అన్ని రంగాల్లో రాణించవచ్చునని, సమానత్వాన్ని, హక్కులను సాధించ వచ్చునని తెలిపారు. టి.బి సూపర్వైజర్ చెరుకు రవికుమార్, హాస్పిటల్ కమిటీ మెంబర్ శోభారాణి, సంఘం గౌరవ అధ్యక్షుడు చంద్ర శేఖర్, ఉపాధ్యక్షులు డాక్టర్ శ్రీనివాసులు, కార్యదర్శి ఎన్.చిన్న నాగన్న, కోశాధికారి శేషమ్మ, సభ్యులు బి.వెంకట రమణ, షేక్షావాలి, సరస్వతి, నాగమద్దిలేటి తదితరులు పాల్గొన్నారు

మహిళల పట్ల అసమానతలు సరికాదు : ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘం

బేతంచర్ల : ప్రస్తుత సమాజంలో పాలక ప్రభుత్వాలు ఆలంబిస్తున్న అసమానతలను మహిళల పట్ల చూపించడం సరైనది కాదని ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘం జిల్లా నాయకురాలు జిసేబా రాణి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బేతంచెర్ల పట్టణంలోని డ్రైవర్స్ కాలనీ నందు మహిళలకు మ్యూజికల్ చైర్ ఆటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా జి సేబారాణి మాట్లాడుతూ మహిళ పట్ల దశాబ్దాల కాలంగా అత్యాచారాలు హింసకాండలు హత్యలు నిర్విరావంగా కొనసాగడం దురదృష్టకరమన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏ మాత్రం స్పందించకపోగా చిన్నచూపు చూస్తు, మహిళ పట్ల అగత్యాలకు పాల్పడిన వారికి మద్దతుగా నిలవడం సిగ్గుచేటని ఆమె విమర్శించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ రెహనా, పార్వతి, రజియా, లక్ష్మీదేవి పద్మావతి, కావేరి, రమీజా పాల్గొన్నారు.

ఆత్మకూరు : కేక్ కట్ చేస్తున్న ఆత్మకూరు మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ ఆసియా

బేతంచెర్లలో..

IN THE COURT OF SENIOR CIVIL JUDGE, DHONE.

E.P. No. 22/2023 IN OS No. 480/2014

M. వెంకటేశ్వర్లు -Dhr

Vs

B. శ్రీనివాసులు
S/o. B. Mahanandaiah
H.No. 8-1-189-21,
Opp. Sri rama Talkies,
DHONE - 51822. -JDr

NOTICE TO JDR U/ORDER 21, RULE-54

పై అమలు దావా నందు డిక్రీ హోల్డర్ తనకు రావలసిన డిక్రీ డబ్బు రాబట్టు కానుటకు వేలం ద్వారా క్రింది దాఖలా ఆస్థిని జప్తు కోరి పై కోర్టు నందు అర్జీదాఖలు చేసియున్నాడు. సదరు దావా నందు నీకు ఈ నోటీసు పత్రికాముఖంగా తెలియజేయడం ఏమనగా పై కోర్టు వారు విచారణ 11-3-2024 వ తేదీని నిర్ణయించినారు. కావున నీవుగాని, నీ వకీలు ద్వారా గాని ఉదయము 10.30 గంటలకు పై కోర్టు ఆఫీసు నందు హాజరు కావలసియున్నది. అట్లు లేని ఎడల నీ పరోక్షమున తీర్మానించబడును.

షెడ్యూలు

నంద్యాల డివిజన్, డోన్ సబ్ డివిజన్, డోన్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న సర్వే నంబరు 280/1లో కల ఇంటి నెంబరు 9/60 కె.వి.ఎస్. కాలనీలోని ఇంటి హద్దులు
తూర్పు : బి. విజయలక్ష్మి ఇల్లు : పడమర:రోడ్డు
ఉత్తరము: కె.ఎస్.జవహర్ ఇల్లు:
దక్షిణం : కె.వి.దేవిప్రియ ఇల్లు
ఇంటికొలతలు: తూర్పు-పడమర-31 అడుగులు
ఉత్తరము-దక్షిణం-17 అడుగులు
మొత్తము 58.55 చదరపు గజాలు
మద్రాస్ టెర్రస్ నిర్మాణము కొతలు
తూర్పు-పడమర-24 అడుగులు
ఉత్తరము-దక్షిణము-17 అడుగులు
మొత్తము 408 చదరపు అడుగులు

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

ఇట్లు
ఆలా.శ్రీధర్, అడ్వకేటు,
డోన్. నంద్యాల జిల్లా.
సెల్ : 9396300365

ఇమామ్‌కు ఇల్లు కట్టించిన మాజీ ఎమ్మెల్యే బిసి

ప్రజాశక్తి - బనగానపల్లె

బనగానపల్లె పట్టణంలోని మాసుం బాష మసీదు పేష్ ఇమామ్‌కు సొంత ఇల్లు లేకపోవడంతో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సొంత నిధులతో ఇల్లును నిర్మించి ప్రారంభించారు. శుక్రవారం రాత్రి మాసం బాష మసీదు ఫేస్ ఇమామ్ ఇంటిని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి ఆయన సతీమణి బిసి ఇందిరా, పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి, టిడిపి నియోజకవర్గ నాయకులు బిసి రామనాథ రెడ్డిలు ప్రారంభించారు. మాసం భాష మసీద్ ఫేస్ ఇమామ్ అద్దె ఇంటిలో నివసి స్తున్నారని , ఇంటి అద్దెను మస్జీద్ కమిటీ చెల్లిస్తోందని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి దృష్టికి విషయాన్ని కమిటీ సభ్యులు తీసుకుపోవడంతో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సొంత ఖర్చులు రూ.7 లక్షలతో ఇంటిని నిర్మించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో బీసీ జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్నో మస్జీద్‌లు, దర్గాలలో సొంత డబ్బులతో పలు మౌలిక సదుపా యాలు కల్పించినట్లు తెలిపారు. ఇటీవల బనగానపల్లె పట్టణంలో చార్‌కమాన్ మస్జీద్ కాంప్లెక్స్‌ను సొంత నిధులతో నిర్మించి ప్రారంభించినట్లు తెలిపారు. పట్టణంలో ఇంటి స్థలం లేని ప్రతి ఒక్కరికి తాను ఎమ్మెల్యే గెలిచాక ప్రభుత్వం ఇచ్చిన ఇవ్వకపోయినా సొంత నిధులతో ఆస్తులు అమ్మి అయిన ఇస్తానాని హామీ ఇచ్చారు. అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్ టిడిపి పట్టణ అధ్యక్షు లు కాసింబాబు నాయకులు కాట్రెడ్డి మల్లికార్జున రెడ్డి, అల్తాప్ హుస్సేన్, రాయలసీమ సలాం, కార్పెంటర్ షబ్బీర్, సయ్యద్ హుస్సేన్, హమ్మద్ హుస్సేన్, ముస్లిం మైనార్టీ నాయకులు, ముస్లింలు, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాసుం బాష మసీదు ఫేస్ ఇమామ్ ఇంటిని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

బాబుతోనే రాష్ట్ర అభివృద్ధి : భూమా

ప్రజాశక్తి - చాగలమర్రి : రాష్ట్రం అభివద్ధి బాటలో నడవా లంటే టిడిపి అధికారం లోకి రావాల్సిన అవ శ్యకత ఎంతైనా ఉందని టిడిపి ఆళ్లగడ యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి తెలియజేశారు. మండలంలోని గొట్లూరు గ్రామంలో శుక్రవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి చేరుకున్న భూమాకు టిడిపి శ్రేణులు భారీ ఎత్తున గజమాలలతో స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికి తిరిగి భవిష్యత్తు గ్యారెంటీ పత్రాలను అందజేసి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. టిడిపి మైనార్టిసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్సర్ బాషా, మండల కన్వీనర్ నరసింహారెడ్డి,టిడిపి నాయకులు ముల్లా అజీమ్, ముల్లా గఫర్ భాష, నూర్ భాషా ఇండ్ల లక్ష్మీరెడ్డి, ప్రతాప్రెడ్డి, కొలిమి మాబు షరీఫ్, హనీఫ్, ఖలీల్, కొలిమి షబ్బీర్, జనార్ధన్ రెడ్డి,సంజన్న, ప్రసాదు, సురేంద్ర,శ్రీనివాస్ రెడ్డి,హనీఫ్, రామ్మోహన్,అజీం, కరిముల్లా,అబ్దుల్లా,ఈశ్వర్ రెడ్డి,గఫార్,సురేష్ కుమార్ రెడ్డి ,కుమార్ రెడ్డి,బాబయ్య,సూర్యం,శేఖర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారంలో భూమా

మహారాజశ్రీ కర్నూలు 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో :

ఓ.ఎస్.నెంబర్ 833/22

దెశెట్టి శ్రీనివాసులు. ...వాది

వర్సెస్

వై.జానకి రాం తండ్రి వై.నారాయణ,
వ్యాపారం, ఇంటి నెంబర్ 51/28,
వెంకటరమణ కాలనీ, కర్నూలు. ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్సు

పై నెంబర్ దావాలో వాది ప్రతివాది నుండి దావా మొత్తము 3,94,866/-లు ముందు వడ్డీ, కోర్టు ఖర్చులు రాగోరి దావా దాఖలు చేసినాడు. ఇందుపైన ప్రతివాది అయిన నీకు ఆక్షేపణలు ఉన్న 19-04-2024వ తేదీ పగలు 10:30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుపుకొన వలెను. లేనంతట నీ పరోక్షమున విచారించి తీర్మానించ బడును

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా తేది : 19-04-2024

డి.మహమ్మద్ రఫీ,
అర్జీదారుపురం అడ్వకేట్,
కర్నూలు.

మహానంది : పూజలు చేస్తున్న వేద పండితులు

ఘనంగా మహాశివరాత్రి వేడుకలు

- శేషవాహనంపై మహానందీశ్వరుడు - భక్తులతో పోటెత్తిన మహానంది క్షేత్రం

ప్రజాశక్తి - విలేకరులు

మహానంది : మహానంది పుణ్యక్షేత్రంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వేకువజాము నుండి భక్తులు క్షేత్రంకు పోటెత్తారు. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు శుక్రవారం శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి వారు శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించి, వేద పండితుల వేద మంత్రాల నడుమ స్వామి అమ్మవార్లకు వేదోక్తంగా విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి అమ్మవార్లు నంది వాహన సేవతో ఆలయ పురవీధులలో గ్రామోత్సవం నిర్వహించారు. దర్శనార్థమై వచ్చిన వేలాది సంఖ్యలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. లింగోద్భకాలంలో సామాన్య భక్తులు కూడా దర్శనం చేసుకునేందుకు వీలుగా ప్రత్యేక సేవా టికెట్లు ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు. జాగరణ భక్తుల సౌకర్యార్థం కోసం రాష్ట్రస్థాయి చెక్కభజన పోటీలు కేరళ వారిచే ప్రత్యేక భజన కార్యక్రమం, ఇతర విశేష సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అనంతరం శనివారం తెల్లవారుజామున రెండు గంటల నుండి లోక క్షేమ కోసం శ్రీ కామేశ్వరి దేవి, మహానందీశ్వరుల కళ్యాణము వైభవంగా ముక్కోటి దేవతలు ఆశీర్వాదంతో లక్షల సంఖ్యలో భక్తుల సమక్షంలో అత్యంత విశేషంగా జరుగును. క్షేత్రానికి వచ్చిన భక్తుల కోసం ఆలయ పరిసరాల్లో మెడికల్ క్యాంపులు, నిత్యాన్నదాన ప్రసాద కౌంటర్లు, మజ్జిగ, త్రాగునీరు ఏర్పాట్లు దాతల సహాయంతో ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు.

వైభవంగా యాగంటిలో.. బనగానపల్లె : మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. యాగంటి శ్రీ ఉమామహేశ్వరులకు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆయన సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మలు పట్టు వస్త్రాలను సమర్పించారు. ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉమా మహేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానానికి వచ్చిన భక్తులకు ఆలయ ఈవో చంద్రశేఖర్ రెడ్డి చైర్మన్ తోట బుచ్చిరెడ్డిలో ప్రత్యేక క్యూ లైన్లను వసతులను కల్పించారు. దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రేలారే రేలా, జబర్దస్త్ కార్యక్రమాలు భక్తులను అలరించాయి. **కొత్తపల్లి:** మహా శివరాత్రి వేడుకలు మండలంలోని సప్తనదుల సంగమ ప్రాంతాన వెలసిన ప్రాచీన సంగమేశ్వరాలయంలో అంగరంగ వైభంగా జరిగాయి. ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ విశేష పూజకార్యక్రమాలు చేశారు. తెలుగురాష్ట్రాలే నుండే కాక దేశనలుమూల నుంచి భక్తులు వచ్చి ఆలయాన్ని దర్శించుకున్నారు. వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా క్యూలైన్లు. సేదతీరేందుకు చలువ పందిళ్లు, సేమియానాలు, మహిళలకు ప్రత్యేక దుస్తుమార్చిడి గదులు ఏర్పాటు చేశారు. **కొలనుభారతిలో...** శివపురం గ్రామం నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన రాష్ట్రంలో ఏకైక సరస్వతి క్షేత్రమైన కొలనుభారతి దేవి క్షేత్రంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయన ప్రదాన అర్చకులు శ్రీనివాస శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సప్తశివాలయాలను దర్శించుకొని, దేవతామూర్తులకు పూజలు చేసుకొన్నారు. అనంతరం సుదూర ప్రాంతాలనుంచి వచ్చిన చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల రద్దీతో సంగమేశ్వరం కొలనుభారతి క్షేత్రాలు కిక్కిరిసి పోయాయి. **గడివేముల :** దక్షిణ కాశీగా పేరొందిన శ్రీ దుర్గా భోగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శివనామ స్మరణతో భక్తులతో కిక్కి రిసింది. ఉమ్మడి జిల్లా నలువైపుల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పంచామృ త కోనేరులలో పుణ్య స్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్యాంసుందర్ శర్మ నంది వాహన సేవలతో బ్రహ్మోత్సవ కార్యక్రమాల్ని నిర్వహించారు. దీక్ష విరమించడానికి ఆలయాలకు తరలిరావడంతో భక్తుల సందడితో శివాలయం కిటకిటలాడింది. ఆలయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ చైర్మన్ సునీల్ కుమార్ రెడ్డి లు వచ్చిన భక్తాదుల కొరకు ప్రత్యేక క్యూ లైన్లు, నీటి వసతి, పందిళ్లను ఏర్పాటు చేశారు. రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. వచ్చిన భక్తులకు కాశిరెడ్డి నాయన నిత్య అన్నదాన సత్రంలో భోజనం ఏర్పాటు చేశారు. వచ్చిన భక్తాదుల కొరకు ఎటువంటి అసౌకర్యం కలవకుండా గడివేముల ఎస్సై బిటి వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది గట్టి బందోబస్తు చర్యలను ఏర్పాటు చేశారు.

పాములపాడు: మహాశివరాత్రి సందర్భంగా పాములపాడు మండలంలోని దేవాలయాలలో భక్తులతో కిటకిటలాడాయి ఉదయాన్నే పూజలు నిర్వహించి భక్తులు శివనామ స్వరాన్ని వినిపించారు మండలంలోని ఇస్కాల గ్రామ సమీపంలోని భవనాసి నది ఒడ్డున ఉన్న నందీశ్వర ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై తమ మొక్కులను తీర్చుకున్నారు ఈ నందీశ్వర ఆలయానికి వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరవుతారు వచ్చిన భక్తులకు దాతలు అల్పాహారము, మజ్జిగ ఏర్పాట్లు చేశారు ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు ప్రసాదాలు అందించారు **పగిడ్యాల :** శివరాత్రి పండుగను పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని శివాలయాలలో శివనామ స్మరణతో మారుమోగాయి. పగిడ్యాల లో వీరవోలు బ్రిడ్జి సమీపాన ఉన్న భీమ లింగానికి, కేసీ కెనాల్ శివాలయంలో , ముచ్చుమర్రి గ్రామంలోని శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శివరాత్రి పండుగ పురస్కరించుకొని తూర్పు ప్రాతకోట గ్రామంలో నాగేశ్వర స్వామి ఆలయంలో రాష్ట్ర హైకోర్టు జడ్జి హరినాథ్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు ఆయన వెంట గ్రామస్తులు పలుచాని మహేశ్వర్ రెడ్డి ఉన్నారు . పడమర పాతకోట గ్రామంలో కాశీ విశ్వేశ్వర ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పగిడ్యాల బీరవోలు బ్రిడ్జి సమీపాన ఉన్న భీమ లింగం దేవాలయంలో మండల హెూమియోపతి వైద్య అధికారిని డాక్టర్ చందన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సమస్యలను అడిగి తెలుసుకుని ఉచితంగా హెూమియో మందులు పంపిణీ చేశారు. **రుద్రవరం :** మండలంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీవాసపురం వెంకటేశ్వర స్వామి ఆలయంలో కొలువైన శివునికి, నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న ఉల్లెడ మల్లేశ్వరుడు, మండల కేంద్రం రుద్రవరంలోని భాస్కర నందీశ్వర ఆలయంలో కొలువైన ఈశ్వరునికి భక్తులు పూజలు నిర్వహించారు. **కొలిమిగుండ్ల :** మండలంలో శివాలయాల్లో భక్తిశ్రద్ధలతో శివరాత్రి వేడుకలను జరుపుకున్నారు. కొలిమిగుండ్లలోని శ్రీ లలిత సుందరేశ్వర స్వామి దేవస్థానం, కోటపాడు శివాలయం అంకిరెడ్డిపల్లి శివాలయం, లక్కిగుండం మహేశ్వర స్వామి, శ్రీ గుండు మల్లేశ్వర స్వామి, కాసుట్ల ఈశ్వరుడు స్వామి, బెలూన్ సిద్ద రామేశ్వర స్వామి, ఎర్రగుడి దేవస్థానం, నేలబెలం మహేశ్వర స్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. **సంజామల :** మండలంలో శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు ఉపవాసాలు ఉంటూ శివాలయాల్లో పూజలు నిర్వహించారు. **ఆత్మకూర్ :** శ్రీశైలం పర్వదిన సందర్భంగా ఆత్మకూరు పట్టణంలోని శివాలయాలు, నల్లమల అడవిలోని రుద్ర కోటేశ్వర స్వామి దేవాలయం, గుమ్మతం తదితర దేవాల యాలు భక్తులతో కిక్కిరిసాయి. రుద్ర కోటేశ్వర స్వామి దేవాలయానికి ఆత్మకూరు నుండి ప్రత్యేక ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. నల్లమల అడవిలో ఈ దేవాలయం ఉండడంతో పెద్ద ఎత్తున భక్తులు జాగరణ చేసేందుకు భారీ స్థాయిలో వచ్చారు.

కొలనుభారతిలో..

పగిడ్యాలలో ఆలయంలో పూజలు చేస్తున్న హైకోర్టు జడ్జి

ఉమామహేశ్వరులకు పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి దంపతులు

శ్రీ దుర్గా భోగేశ్వరస్వామి ఆలయంలో

IN THE COURT OF SENIOR CIVIL JUDGE, DHONE.

E.P. No. 21/2023 IN OS No. 476/2014

A. SURESH -Dhr

Vs

B. SREENIVASULU
S/o. B. Mahanandaiah
H.No. 8-1-189-21,
Opp. Sri rama Talkies,
DHONE - 51822. -JDr

NOTICE TO JDR U/ORDER 21, RULE-54

పై అమలు దావా నందు డిక్రీ హోల్డర్ తనకు రావలసిన డిక్రీ డబ్బు రాబట్టు కానుటకు వేలం ద్వారా క్రింది దాఖలా ఆస్థిని జప్తు కోరి పై కోర్టు నందు అర్జీదాఖలు చేసియున్నాడు. సదరు దావా నందు నీకు ఈ నోటీసు పత్రికాముఖంగా తెలియజేయడం ఏమనగా పై కోర్టు వారు విచారణ 11-3-2024 వ తేదీని నిర్ణయించినారు. కావున నీవుగాని, నీ వకీలు ద్వారా గాని ఉదయము 10.30 గంటలకు పై కోర్టు ఆఫీసు నందు హాజరు కావలసియున్నది. అట్లు లేని ఎడల నీ పరోక్షమున తీర్మానించబడును.

షెడ్యూలు

నంద్యాల డివిజన్, డోన్ సబ్ డివిజన్, డోన్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న సర్వే నంబరు 280/1లో కల ఇంటి నెంబరు 9/60 కె.వి.ఎస్. కాలనీలోని ఇంటి హద్దులు
తూర్పు : బి. విజయలక్ష్మి ఇల్లు : పడమర:రోడ్డు
ఉత్తరము: కె.ఎస్.జవహర్ ఇల్లు:
దక్షిణం : కె.వి.దేవిప్రియ ఇల్లు
ఇంటికొలతలు: తూర్పు-పడమర-31 అడుగులు
ఉత్తరము-దక్షిణం-17 అడుగులు
మొత్తము 58.55 చదరపు గజాలు
మద్రాస్ టెర్రస్ నిర్మాణము కొతలు
తూర్పు-పడమర-24 అడుగులు
ఉత్తరము-దక్షిణము-17 అడుగులు
మొత్తము 408 చదరపు అడుగులు

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

ఇట్లు
ఆలా.శ్రీధర్, అడ్వకేటు,
డోన్. నంద్యాల జిల్లా.
సెల్ : 9396300365